Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 28 - No.10

August 2022



## దేశభక్తి

# దైవభక్తి - దేశభక్తి

చీపుర్లు పట్టుకొని వీధులన్నీ శుభ్రం చేయడాన్నే దేశభక్తి అని, సినిమా థియేటర్లలో సినిమాకు ముందు 'జనగణమన' వేయగానే నిలబడి గొంతెత్తి సెల్యూట్ చేయడమే నిఖార్సైన దేశభక్తి అని అంటుంటారు కొందరు. పార్క్‌లో ఆడామగ జంటగా కనిపిస్తే చాలు.. బల వంతంగా తాళి కట్టించేసి... ఇదే హిందూస్థాన్ దేశభక్తి అంటూ హడల్ గొడతారు మరికొందరు. మేము చెప్పిందే 'వేదం'... మేము చేసేదే 'ధర్మం'.. కాదన్నవారంతా దేశద్రోహులే అని అంటాడు మరొకాయన. ఇలా చెప్పుకొంటూపోతే దేశంలో వివిధరకాల దేశభక్తుల గురించి, దేశభక్తి ముసుగులో స్వంత ఎజెండాలు అమలు చేస్తున్న వైనాన్ని గురించి ఆలోచించాలి. అసలు దేశభక్తి అంటే ఏంటి?

దేశభక్తి అంటే జనవరి 26న, ఆగస్టు 15న ఊక దంపుడు సందేశాలు ఇవ్వడం కాదు, దేశాన్ని, దేశ ప్రజల ను ప్రేమించడం. దేశాన్ని ప్రేమించేవారు, దేశభక్తిగల వారు అవినీతికి, అక్రమాలకు, దోపిడీకి, హింసకు పాల్ప దరు. కుల, మత ద్వేషాలు రెచ్చగొట్టరు. అన్యాయాన్ని ఎదిరిస్తారు, లంచగొండితనాన్ని అంతమొందిస్తారు. తోటి మనిషిని సోదర ప్రేమతో చూస్తారు. నిజాయితీగా జీవిస్తారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తారు. దేశ సంక్షేమం కోసం, అభివృద్ధికోసం కృషిచేస్తారు. ప్రకృతి వనరుల్ని నాశనం చేయరు. ఇలా చెప్పుకొంటూ పోతే, దేశభక్తి అన్నిట్లోనూ చూపించాల్సి ఉంటుంది.

దేశభక్తి కొందరి సొత్తుకాదు. దేశాన్ని, దేశ ప్రజలను నిస్వార్థంగా ప్రేమించి, దేశానికి సేవచేసే ప్రతి ఒక్కరూ దేశభక్తులే. క్రైస్తవులకు దేశభక్తిలేదనేది కొందరి వాదన. మన దేశాన్ని, దేశ ప్రజలను ఎంతోమంది మిషనరీలు కూడా ఎంతగానో ప్రేమించారు. వారిలో ఇంగ్లండ్ నుండి భారతదేశానికి వచ్చిన ఛార్లెస్ ఫ్రీర్ ఆండ్రూస్ ఒకరు. సి.యఫ్. ఆండ్రూస్ ఢిల్లీలోని స్టీఫెన్ కాలేజ్‌లో తత్వశాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తూ, సువార్త ప్రకటిస్తూ, భారతదేశంలోని అంటరానితనం, పేదరికం, జాతి వైషమ్యాలు చూచి చలించిపోయాడు. భారతదేశం, ఫిజీ, దక్షిణాఫ్రికాలోని పేద, అణచివేయబడిన ప్రజలను ప్రేమించి గోపాలకృష్ణ గోఖలే, మహాత్మాగాంధీతోపాటు బానిసత్వ విమోచన కోసం ఎంతో పోరాడాడు. పేదలకు, అవసరాల్లో ఉన్న వారికి ఆయన చేసిన సేవను బట్టి, వారిని ప్రేమించిన విధానాన్ని బట్టి అప్పటి స్టీఫెన్ కాలేజ్ విద్యార్థులు, ప్రజలు ఆయన్ను 'దీనబంధు' అంటే 'ఫ్రెండ్ ఆఫ్ ద పూర్' అని పిలిచారు. ఈయన దేశానికి చేసిన సేవకు గౌరవార్థంగా ఆయన పేరుమీద భారతప్రభుత్వం 12 ఫిబ్రవరి 1971న ఒక స్టాంప్‌ను విడుదల చేశారు.

అమెరికానుండి గుంటూరుకు వచ్చిన మెడికల్ మిషనరీ డాక్టర్ కుగ్లర్ గుంటూరు జిల్లాకు ఎనలేని సేవచేశారు. డాక్టర్ కుగ్లర్ సేవా పరిచర్యను గూర్చి దేశభక్త అనే బిరుదు కలిగిన కొండా వెంకటప్పయ్య పంతులు తన జీవిత చరిత్ర ప్రథమ భాగంలో "అమెరి కా నుండి మిషనరీగా వచ్చిన ఈమె వైద్యం చేయడంలో పెద్ద పేరుకలిగిన వ్యక్తని ఇంటింటికీ తిరిగి రోగులకు ఉచితంగా వైద్యం చేసేదని" రాశాడు.

గ్రేహం స్టెయిన్స్ చనిపోయినప్పుడు స్థానికంగా ఉన్న కుష్టువారు ఆయన చేసిన సేవను గుర్తుచేసుకొంటూ "మా ప్రపంచం చీకటిమయం. మృత్యువును సమీపించేవారం. మేము కనబడినప్పుడు రాళ్ళు రువ్వేవారు. అంటరాని వాళ్ళమని నీచంగా చూసేవారు. పూర్వజన్మ పాపం వల్ల వ్యాధి వచ్చిందని పురుగుల్లా అడవుల్లో చనిపోవాలని కోరుకొనేవారు. దొరగారు, అమ్మగారు మమ్మల్ని ఆప్యాయంగా చూసి, మా పుండ్లు కడిగి మాకు క్రీస్తు బోధలన్నిటినీ కథలుగా వివరించి చెప్పేవారు. అంత దయగల బాబు మాకు దూరమయ్యాడని" ఏడ్చారు.

జార్జిజోసఫ్ (1887-1938) సంపన్న కుటుంబానికి చెందిన కేరళ క్రైస్తవుడు. ఇంగ్లడ్‌లో చదువు ముగించాక, మధురైలో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించి, అనీబిసెంట్ యొక్క హోంరూల్ ఉద్యమానికి ఆకర్షితుడై, తన సుఖాల్ని త్యాగం చేసి జాతీయోద్యమం, సహాయనిరాకరణోద్యమం, విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని జైలు జీవితాన్ని కూడా అనుభవించాడు.

యుఇయస్‌ఐ మొట్టమొదటి జనరల్ సెక్రటరీ పిటి చాందపిళ్ళగారు దేశభక్తిగలవాడు. పాశ్చాత్య దేశాలలో చదువుకొన్నప్పటికీ, ఖాదీవస్త్రాలను మాత్రమే వాడుతూ భారతదేశ ప్రజలను, విద్యార్థులను ఎంతో ప్రేమించి వారిని చెడు జీవితాన్నుండి మళ్ళించాడు. అనేకమందిని ప్రభావితం చేశాడు.

నిస్వార్థమైన దేశభక్తి, నిజమైన దైవభక్తినుండే వస్తుంది. దైవభక్తి దేవునితో ఉండే సంబంధం, సహవాసంను బట్టి వస్తుంది. ఒక వ్యక్తి నిజదేవుడైన యేసుక్రీస్తుతో ఎంత ఎక్కువ సహవాసం కలిగివుంటాడో ఆ వ్యక్తి అంత నిజాయితీగా, నిస్వార్థంగా జీవిస్తూ, తోటివారిని ప్రేమిస్తూ, వారికి సేవచేస్తాడు. దేశాన్ని పాడుచేసే మతతత్వం, వ్యభిచారం, జారత్వం, అవినీతి, లంచగొండితనం, గురుభక్తి, కుల, వర్గ, ప్రాంతీయ భేదాలు నిర్మూలమయ్యేటట్లు విజ్ఞాపన చేస్తాడు. గనుక దైవభక్తి కొదువైతే దేశభక్తి కొదువవుతుందనే సత్యాన్ని గమనించి దైవభక్తిలో ఎదుగుతూ దేశాన్ని, దేశప్రజలను ప్రేమిద్దాం.

- పి. సునీల్ జాకబ్




Vol. 28, No.9 August 2022
A Publication of
UESI Publication Trust

EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Dr. J. Subbarao - Sec., Litt.Dept.

CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
ANNUAL: GRADUATES - Rs.250
STUDENTS - Rs. 120
LIFE INLAND - Rs. 2000
LIFE OVERSEAS - US $ 150

VIDYARTHI JWALA ACCOUNT NO:

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

# Indian National Pledge

India is my country.

All Indians are my brothers and sisters.

I love my country and, I am proud of it's rich and varied heritage.

I shall always strive to be worthy of it.

I shall give my parents, teachers and all elders respect and treat everyone with courtesy.

To my country and my people, I pledge my devotion.

In their wellbeing and prosperity alone, lies my happiness.



## లోపలి పేజీల్లో...

- దేశభక్తి-దైవభక్తి - 2
- దేశమంటే మట్టి కాదు - 4
- క్రైస్తవులు దేశానికి ఉపకారులా? అపకారులా? - 9
- బానిసత్వం నుండి స్వాతంత్ర్యానికి - 13
- భారతదేశ స్వాతంత్ర్యం - క్రైస్తవ నాయకత్వం - 14
- భారతదేశం ఎదుర్కొంటున్న సమకాలీన సవాళ్ళు - 18
- ప్రభూ... నెహెమ్యా బుద్ధి నాకివ్వు - 21
- అన్ని విషయాల్లో స్వాత్రంత్యం ఉంది కానీ...- 22
- ఇంకెవరు? - 24
- మేధోపరమైన పోరాటానికి సమయం ఆసన్నమైంది - 25
- నువ్వు విడుదల పొందావా? - 28
- క్రాస్ వర్డ్ పజిల్ - 30
- కోశాధికారి లేఖ - 31
- దేశభక్తి - 32



# దేశమంటే మట్టి కాదు

"దేశభక్తి ఎప్పుడూ దేశంకోసం చనిపోవడం గూర్చి మాట్లాడుతుందే కానీ, దేశం కోసం చంపడం గూర్చి కాదు" అని బెర్ట్రాండ్ రస్సెల్ అంటాడు. "మనం మొదట భారతీయులం, ఆ తర్వాతే హిందువులమైనా, ముస్లిములమైనా" ఇది మహాత్మాగాంధీ వ్యాఖ్యానం. "మనం మొదట, చివర కూడా భారతీయులమే కావాలి. భారతీయు లుగా తప్ప మరొకటి కాకూడదు" ఇది డాక్టర్ అంబేద్కర్ వ్యాఖ్యానం. కానీ క్రైస్తవులుగా మన అవగాహన ఇంకొంచెం ముందుకెళ్ళాలి. ఈ అవగాహన కోసమే ఈ వ్యాసం.

## అర్థం, అపార్థం

దేశాభిమానం, దేశభక్తి రెండూ ఒకటి కాదు. మొదటిది పేట్రియాటిజం. రెండవది పేట్రియాటిజానికి మన మేధావులు ఇచ్చిన అనువాదం. ఇది సరైన అనువాదం కాదు. వక్రీకరించబడిన అర్థం.

## దేశాభిమానం

పేట్రియాటిజం అంటే దేశాభిమానం, దేశప్రేమ. దేశమంటే మట్టి కాదు. చెట్టు, పుట్ట, నదులు, సముద్రాలు, కొండలు, నదీ సంగమాలు కాదు. దేశమంటే ప్రజలు. ప్రజలు లేకుండా ప్రదేశానికి విలువ, ప్రాముఖ్యం లేదు. ప్రజల వలనే వీటికి ప్రాముఖ్యత విలువ వచ్చింది. దేశప్రేమ, దేశాభి మానం అంటే చెట్టు పుట్టలకు, స్మారక కట్టడాలకు, పూర్వీకులు సృష్టించిన శిల్ప సౌందర్యానికి, నదులు సముద్రాలకు హారతులు పట్టడం కాదు, తేనెల తేటల మాటలతో కీర్తించడం, పొగడడం అంతకంటే కాదు. దేశ ప్రజలను ప్రేమించడం, దేశ ప్రజల ను అభిమానించడం, గౌరవించడం, ఆదరించడం. సమాజ పురోగతి కొరకు పునరంకితమవ్వడం. అది పేట్రియాటిజం. దేశ పేరు ప్రతిష్టల కొరకు, గౌరవ మర్యాదల కొరకు ఆలోచనలో, ఆచరణలో, పునరంకితమవడం పేట్రియాటిజం.

## దేశభక్తి

దేశభక్తి అనగా ఒక వ్యక్తి తన దేశంపైన చూపే ప్రేమ, అభిమానం, గౌరవం. ఇది ప్రజాస్వామ్య విలువలతో కూడిన ఆచరణ యోగ్యమైన స్పందన. దేశభక్తిని స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, విలువలకు చూపించే గౌరవం, కృతజ్ఞతా భావన అని కూడా చెప్పవచ్చు.

భారతదేశ సంస్కృతిగా చెప్పబడుతున్న హిందూమత సంస్కృతిని విమర్శనా రహితంగా కీర్తించడం మన చారిత్రక పురుషులను, పురాణ పురుషులను పొగడడం, విచక్షణారహితంగా విదేశీయులను, వారి భావాలను, సంస్కృతిని, నాగరికతను విమర్శించడాన్ని దేశభక్తిగా మన మేధావులు చెపుతున్నారు. అది తప్పు. దీన్ని దేశభక్తి అనరు. సంకుచితత్వం అంటారు. ఈ వైఖరివల్ల దేశానికి, దేశప్రజలకు తీరని నష్టం వాటిల్లుతున్నది.

## జాతీయత

దేశ భక్తికి భిన్నంగా జాతీయవాదం ఉంటుంది. తమ దేశం పట్ల ఉన్న ప్రేమను ఇతర దేశాల

పట్ల ఉన్న గౌరవానికి అతీతంగా పక్షపాత వైఖరితో చూపించేది. జాతీయవాదంలో ఒక జాతి మరొక జాతి కంటే ఉన్నతమైనదని భావించి దానిని అన్ని విధాలుగా మరి ముఖ్యంగా రాజకీయంగా సాధించే ప్రయత్నం చేయటం. వివేకానందుడు 'ఆర్యపురుషు'ని ఇతర ప్రపంచ పురుషుల కంటే ఉన్నతమైనవాడని అంటాడు. జాతీయ భావాన్ని విశ్వసించే వారు 'మనము', 'ఇతరులు' అనే వ్యత్యాస భావనను ప్రజల్లో కలిగిస్తారు. వారు స్వజాతి వారిని జాతీయ వాదులని, దేశభక్తులని, మిగతా వారిని 'చొరబాటుదారులని' (intruders) నమ్మజూపుతారు. శుద్ధ అశుద్ధ (Purity-Impurity) అనే భావనను లేవదీసి దానికి మతపరమైన భావజాలాన్ని ఆపాదించి, ఆ శుద్ధతను కాపాడుటయే 'దేశ భక్తి', 'ధర్మమని' ప్రచారం చేస్తారు. దానికి వారు ఒక నాగరికతను, భాషను, మతాన్ని అంటగడతారు. వారు శక్తివంతమైన, నిరంతర జాతీయతను ప్రోత్సహిస్తారు. ఫాసిస్ట్ పాలకులు నిరంతరం దేశభక్తి నినాదాలు, మత పరమైన సమావేశాలు, చిహ్నాలు, పాటలు, జెండాలను ఉపయోగిస్తారు. కొందరిని దేశ శత్రువులుగా చిత్రీకరించి సొంత ప్రజల మానవ హక్కులను విస్మరిస్తారు. మిలటరీ, మీడియా ఆధిపత్యాన్ని చెలాయిస్తారు. ఇతర దేశాలను శత్రువులుగా చూపి ప్రజల భయాన్ని పూర్తిగా సొమ్ముచేసుకొంటారు. పరస్పర ప్రయోజనకరమైన వ్యాపార లావాదేవీల ద్వారా కార్పొరేట్ శక్తిని పెంచి పోషించుకొంటారు. శ్రామిక శక్తిని, ఐక్యతను నీరుగారుస్తారు. మేధావులు కళల పట్ల అగౌరవం ప్రచారం చేస్తారు. నేరం, శిక్షలతో విలయ తాండవం చేస్తారు. అంతర్గత అధికార పంపిణీతో ఒకరిని ఒకరు రక్షించుకొంటారు. మోసపూరిత ఎన్నికల తతంగాన్ని నడుపుతారు. చివరిగా ప్రజల భావోద్రేకాలను సొమ్ము చేసుకోవటానికి మతాన్ని, ప్రభుత్వ విధానాలను మిళితం చేస్తారు.

## బైబిల్ దేశభక్తి

దీనికి భిన్నంగా బైబిల్ దేవుడు భూమిపై ఉన్న అన్ని దేశాలను ప్రేమిస్తున్నాడని ప్రబోధిస్తూ మతపరమైన హింసను నిరసిస్తుంది. "యూదుడు లేదా అన్యజనుడు, బానిస లేదా స్వతంత్రుడు లేదా స్త్రీ మరియు పురుషుడు అని లేరు, ఎందుకంటే అందరూ క్రీస్తు యేసులో ఒక్కటే" (గల. 3:28) అనే పౌలు యొక్క ప్రసిద్ధ వాదన దేవుని రాజ్యంలో

దేశం పట్ల ఏ ప్రేమ అయినా, ఆ ప్రేమ ఎంత స్వచ్ఛమైనదైనా, గౌరవప్రదమైనదైనా సరే మన మొదటి ప్రాధాన్యత మాత్రం దేవుని రాజ్యం అయి ఉండాలి. ఎందుకంటే, "దేశంపై ప్రేమ దేవుడిగా మారినప్పుడు అది విగ్రహమై కూర్చుంటుంది" అని అంటాడు సియస్ లూయిస్ తన 'ది ఫోర్ లవ్స్' అనే పుస్తకంలో.

జాతీయవాదం ఎప్పటికీ భాగం కాకూడదని నిరూపిస్తుంది. కాబట్టి క్రైస్తవుడు మొదట దైవభక్తిని అలవాటు చేసుకోవాలి. దేవుని యెడల భయము, భక్తి ఉంటే దేశం యెడల ఉన్నట్లే (సామె 9:10) తన స్వదేశాన్ని ప్రేమిస్తూనే, బాధ్యతగా ఉంటూనే విశ్వ మానవ సమతా భావాన్ని అలవరచుకోవాలి. 'తల్లి చెడ్డదైనా మంచిదైనా ప్రేమిస్తాను' అని అనడంలో అర్థం ఉంది కానీ 'ఆమె చేసే చెడును మంచి అని సమర్థిస్తాను' అని అనడంలో మోసం ఉంది అంటాడు జి కె చెస్టర్ టన్. మరో మాటలో చెప్పాలంటే, నిజమైన, మంచి దేశభక్తి కలిగి ఉండటమంటే ఆ దేశం యొక్క విజయాలు మరియు దాని లోపాలను అంచనా వేయగలగాలి.


## మొదటి ప్రాధాన్యం దైవ రాజ్యమే!

దేశం పట్ల ఏ ప్రేమ అయినా, ఆ ప్రేమ ఎంత స్వచ్ఛమైనదైనా, గౌరవప్రదమైనదైనా సరే మన మొదటి ప్రాధాన్యత మాత్రం దేవుని రాజ్యం అయి ఉండాలి. ఎందుకంటే, "దేశంపై ప్రేమ దేవుడిగా మారినప్పుడు అది విగ్రహమై కూర్చుంటుంది" అని అంటాడు సియస్ లూయిస్ తన 'ది ఫోర్ లవ్స్' అనే పుస్తకంలో. క్లుప్తంగా చెప్పాలంటే, మన దేశ భక్తిని, దేవుని పట్ల మనకున్న ప్రేమను వక్రీకరించడానికి చాలా అవకాశాలున్నాయి. అనేక సందర్భాల్లో, దేవుని పట్ల మనకున్న ప్రేమను అపార్థం చేసుకొని తోటి మానవులకు అన్యాయం

చేసే దుస్థితి దాపురించవచ్చు. దైవ రాజ్య స్థాపన పేరిట, ధర్మ పరిరక్షణ పేరిట తన స్వకీయులకే అన్యాయం చేసే వక్రబుద్ధి దాపురించవచ్చు. మతాల పేరిట, జాతుల పేరిట నేడు జరుగుతున్న మారణ హోమాలు ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యాలు. ఒకరి దేశాన్ని ప్రేమించడం దైవికమైన పని అని యేసు మనకు బోధించాడు. కానీ యేసు అన్ని దేశాల ప్రజల కోసం మరణించాడు. తన స్వంత దేశం యొక్క ప్రయోజనాల కంటే విశ్వవ్యాప్త మానవ క్షేమం కోసం ప్రాణాన్ని అర్పించాడు. అందుకనే క్రైస్తవులకు దేశభక్తి ఉంటుంది కానీ క్రైస్తవ జాతీయత ఉండదు. యోహాను దర్శనంలో "ప్రతి జనములోనుండియు ప్రతి వంశములోనుండియు ప్రజలలోనుండియు, ఆయా భాషలు మాటలాడువారిలో నుండియు" (ప్రక 7:9) అంటూ క్రైస్తవుడు మొదట దేవునికి, పిమ్మట విశ్వమానవ సౌభ్రాతృత్వానికి ప్రాధాన్యత నివ్వాలని చూపిస్తూ, అదే నిత్యత్వంలో నిలబడేదని ప్రకటిస్తాడు.

## నిజమైన దేశభక్తులెవరు?

ఎవరిని దేశభక్తులని అంటాం? యుద్ధవీరులనా? సునిశిత మేధస్సు గలవారినా? రాజనీతిజ్ఞులనా? వ్యాపారస్తులనా? కొన్ని కులాల వారినా? కొన్ని మతాల వారినా ? ఒక మతాన్ని, కులాన్ని, నాయకుని పొగిడిన వారినా? కాదు! ఇవన్నీ పాక్షికమైనవే. సంపూర్ణమైనవేవీ కాదు. వ్యక్తిగత నైతికత యెడల చిత్తశుద్ధి అనేది మౌలికంగా ఉన్నతికి, దేశ భక్తికి పునాది. కాబట్టి, నిజమైన దేశభక్తునికి మొట్టమొదట ఉండాల్సిన లక్షణం నిజాయితీ. వ్యక్తిత్వం లేని దేశభక్తి దుర్మార్గుల ధర్మంగా రూపాంతరం చెందుతుంది.





- ❈ ఒక ప్రజా ప్రయోజనానికి సంబంధించి ప్రేరణ పొందినవాడే దేశభక్తుడు.
- ❈ దేశంలోని అసమానతలకు కారణమైన వ్యవస్థలను ప్రశ్నించేవాడు దేశభక్తుడు.
- ❈ యోగా అభ్యాసం చేసే వానికంటే, అక్రమంగా సంపాదించని వాడు దేశభక్తుడు.
- ❈ పన్నులు ఎగగొట్టే వానికంటే, వాటిని చెల్లించేవాడు దేశభక్తుడు.
- ❈ మనిషిని పశువులా చూసే వానికంటే, మనిషిని మనిషిలా చూసేవాడు దేశభక్తుడు.
- ❈ మందిరాలకన్నా, విజ్ఞాన గ్రంథాలయాలను నిర్మించేవాడు దేశభక్తుడు.
- ❈ చట్టాలను తన చేతుల్లోకి తీసుకొనే వాడికంటే, చట్టాలను గౌరవించే వాడు దేశభక్తుడు.
- ❈ మూఢనమ్మకాలను ప్రోత్సహించే వాని కంటే, శాస్త్రీయ విజ్ఞానాన్ని అభివృద్ధి చేసేవాడు దేశభక్తుడు.

## క్రీస్తు బోధ నిజమైన దేశ భక్తికి నాంది

"నా బైబిల్ నా తోటి మనిషిని ఏ కారణం చేతనైనా ద్వేషించమని చెబుతున్నట్లయితే, నా విశ్వాసాన్ని ఆ క్షణమే త్యజిస్తాను. తాను సృష్టించిన మానవులను తూలనాడే ఏ దేవుడైనా, ఏ మతమైనా విశ్వాసం పేరుతో హింసిస్తే అది ఆధ్యాత్మికతే కాదు, ఆయన దేవుడే కాదు. అటువంటి గ్రంథాలను నేనే కాల్చేస్తా" అంటాడు ఒక రెఫార్మిస్ట్ వేదాంతి. దేశమంటే మట్టి కాదు దేశమంటే మనుషులు. మాటల్లో 'మానవ సేవయే మాధవ సేవ' అని ఊకదంపుడు ప్రసంగాలిచ్చేవారు తోటి మానవుల శ్రేయస్సు కంటే ప్రకృతి ప్రతి రూపాలకో, జంతు సంరక్షణకో ప్రాధాన్యత నివ్వడమే కాకుండా, వాటి కోసం తన దేశ ప్రజలను సహితం హింసించడానికి, ప్రాణాలను తీయటానికి కూడా వెనుకాడటం లేదంటే అట్టి దేశభక్తి నిజమైనదేనా?

క్రైస్తవుని దేశభక్తి పొరుగువారిని ప్రేమించడంతో ప్రారంభమవుతుంది (మత్తయి 22:37-39). మనల్ని మనం ఇతరులకన్నా ఎక్కువగా ఎంచుకోవడం తప్పు అని కొత్త నిబంధన మనకు బోధిస్తుంది (ఫిలిప్పీ 2:3). క్రైస్తవుడు లేమితో ఉన్న తన సహోదరునికి సహాయం చేయటమే కాక అవసరమైతే ప్రాణాన్ని సహితం పెట్టబద్ధుడై ఉన్నాడు. క్రైస్తవుడు తన



యేసుక్రీస్తు తన పరిచర్య కాలంలో ప్రజల మనిషిగా వారిమధ్యే జీవించాడు. ఒక సాధువుగా పేరు ప్రఖ్యాతులున్నా, అద్భుతాలు చేయగల శక్తివున్నా చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకొనే ఉన్మాద గుంపుని తయారు చేయలేదు, ఆధ్యాత్మికత పేరుతో కేంద్రాలు స్థాపించి, ఆస్తులు పోగుచేసుకొని సుఖపడలేదు. ప్రభుత్వాన్ని గౌరవించమని బోధించాడు, అలా ఆయన చేశాడు. ప్రజా సంక్షేమానికి హాని చేసే ప్రభుత్వ, మతనాయకుల దుశ్చర్యలను ఖండించాడు. అన్నార్తులను ఆదరించాడు. పేదలను బలపరిచాడు,పామరులను చైతన్య పరిచాడు, పతితలను ఓదార్చాడు.

దేశాన్ని ప్రేమిస్తాడు అంతకంటే ఎక్కువగా క్రీస్తును ప్రేమిస్తాడు. దైవభక్తిగల నాయకులు దేశభక్తి గలవారై ఉండాలని బైబిల్ బోధిస్తుంది. క్రైస్తవుని పౌరసత్వం పరలోకానికి సంబంధించినదే అయినా (1 పేతురు 2:9-12) అది ఈలోక బాధ్యతలను తిరస్కరించదు. క్రైస్తవుడు భారత దేశాన్ని క్రైస్తవ జాతిగా సృష్టించాలని ప్రయత్నించడు. నిజానికి క్రైస్తవ్యానికి జాతి లేదు. అది క్రీస్తు జీవన విధానం. క్రైస్తవుడు భారతదేశాన్ని ప్రేమించడం కంటే భారతీయులను ప్రేమించడం చాలా ముఖ్యమని నమ్ముతాడు. థామస్ జెఫెర్సన్ చెప్పినట్లు "దేవుడు నీతిమంతుడని నేను ఆలోచించిన ప్రతిసారి నేను నా దేశం కోసం వణుకుతూ నన్ను నేను పునరంకితం చేసుకొంటాను"

## క్రైస్తవుని కర్తవ్యం

జాత్యహంకారంతో విర్ర వీగడానికి, ప్రపంచంలోని అత్యుత్తమమైన వాటిలో భారతదేశం అగ్రస్థానంలో ఉండాలని కోరుకోవటానికి మధ్య చిన్న తేడా ఉంది. మొదటిది పాపం. రెండవది క్రైస్తవుని ఆశ. రెండవ దాని కోసం జీవితంలో ప్రతి ప్రయత్నంలో దేవుని వాక్యానికి లోబడుతూ, పరిశుద్ధాత్మ శక్తి ద్వారా మన చుట్టూ ఉన్న సంస్కృతి/ప్రభుత్వంలో బైబిల్ విలువలను చొప్పించడానికి మీరు చేయగలిగినదంతా చేయాలి.


- ❈ పౌరులుగా మరియు క్రైస్తవులుగా, మనం ఇతర జాతీయుల పట్ల అయిష్టతను, భయాన్ని త్యజించాలి.
- ❈ ఇతర దేశాలను-రాజ్యాలను బలిగొనే, మన దేశాన్ని-సంస్కృతి సంప్రదాయాలను ఎల్లప్పుడూ ఉన్నతమైనవిగా భావించే 'మన-ఇతర' అనే మనస్తత్వాన్ని విడనాడాలి.
- ❈ దేవుని సృష్టియొక్క అన్ని రూపాల్లోని స్త్రీ, పురుష, సామాజిక, సాంస్కృతిక, మత మరియు రాజకీయ వైవిధ్యం పట్ల గౌరవాన్ని పెంపొందించాలి.
- ❈ ఉక్రెయిన్, పాలస్తీనా, న్యూయార్క్ లేదా ఆఫ్ఘనిస్తాన్‌లో అన్యాయం ఏ రూపంలో ఉన్నా, అది ఎక్కడ ఉన్నా దాని గురించి పట్టించుకోవాలి, ప్రార్థించాలి.
- ❈ మన స్వదేశీయులు దేశ ద్రోహులు అని ముద్ర వేసిన వారి కొరకు ప్రార్థించాలి
- ❈ నాయకుల పట్ల అగౌరవంగా మాట్లాడక (రోమా 13:1-7), వారి కోసం ప్రార్థించాలి. (1 తిమో 2: 1-4)
- ❈ మన పిల్లలు దేశచరిత్రను విచక్షణాత్మకంగా నేర్చుకోవాలి. దేశభక్తిని జాతీయవాదంతో కలగాపులగం చేయవద్దు.
- ❈ భారతీయులుగా మనకు లభించిన ఆశీర్వాదాలకు కృతజ్ఞతతో ఉండండి.
- ❈ క్రైస్తవ గుర్తింపును బట్టి నాయకులను ఎన్నుకోకూడదు. బైబిల్ సూత్రాలకు ఓటు వేయండి.
- ❈ కేవలం సువార్తకు మాత్రమే కాక దేశభక్తికి సంబంధించి అన్ని రకాల కార్యక్రమాలలో పాల్గొనాలి.
- ❈ సంఘాలలో, సండేస్కూల్స్‌లో దేశభక్తి గురించి బోధించాలి. కొన్ని కార్యక్రమాలను చేపట్టాలి.

## యేసుక్రీస్తు పరిపూర్ణ మాదిరి

దేశం స్వతంత్రం పొందడం వేరు, దేశప్రజలు స్వతంత్రం పొందడం వేరు. దేశ ప్రజలకు స్వాతంత్ర్యం వస్తేనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్లు. ప్రపంచంలో ఎందరో దేశాలకు స్వతంత్రాన్ని తెచ్చి పెట్టారు కానీ మనిషికి స్వతంత్రం ఇవ్వలేక పోయారు. యేసు క్రీస్తు తన బోధలలో అబ్రాహాము సంతానము అని విర్రవీగే నైజాన్ని ఎండగడుతూ, దేవుని రాజ్యం సార్వజనీనమైనదని చెప్పడంతో వారు ఆయనను ద్వేషించటం ప్రారంభించారు.(మత్తయి 8:11-12) యెరూషలేము గురించి యేసు విలపించినప్పుడు తన దేశం, ప్రజలపట్ల ఆయనకున్న ప్రేమను ప్రద ర్శించాడు. (లూకా 13:34). ఆయన తన పరిచర్య కాలంలో ప్రజల మనిషిగా వారిమధ్యే జీవించాడు (యోహా1:14). ఒక సాధువుగా పేరు ప్రఖ్యాతులు న్నా, అద్భుతాలు చేయగల శక్తిఉన్నా చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకొనే ఉన్మాద గుంపుని తయారు చేయలేదు, ఆధ్యాత్మికత పేరుతో కేంద్రాలు స్థాపించి, ఆస్తులు పోగుచేసుకొని సుఖపడలేదు (లూకా9:58). ప్రభుత్వాన్ని గౌరవించమని బోధించాడు, అలా ఆయన చేశాడు(మార్కు 12:17).ప్రజా సంక్షేమానికి హాని చేసే ప్రభుత్వ,మతనాయకుల దుశ్చర్య లను ఖండించాడు (లూకా13:32). అన్నార్తుల ను ఆదరించాడు (మత్త 14:13-24).పేదలను బలపరిచాడు (లూకా6:20-21), పామరులను చైతన్య పరిచాడు (మత్త 5:14).పతితలను ఓదార్చాడు (యోహా8:11).గ్రీకుల ఆహ్వానాన్ని తిరస్కరించి మేధావిగా విద్యయొక్క నిజమైన విధి ఏమిటో చాటి చెప్పాడు (యోహా12:2-50). అర్థంలేని ఆచార సంప్రదాయాలను ఖండించి, నిజమైన భక్తి ఏమిటో చెప్పాడు. దీనులను, పీడితులను వేధించేది మతమే కాదని బోధించాడు (మత్త23). యేసు పిలాతుతో, “నా రాజ్యం ఈ లోకానికి సంబంధించినది కాదు. (యోహాను 18:36) అని చెప్పడంలో ఆయన నిజమైన రాజ్యమేమిటో ఇట్టే అర్థమవుతుంది.అనేకమంది యూదులు ఊహించినట్లుగా ఆయన రాజకీయ లేదా భూసంబంధమైన రాజ్యాన్ని స్థాపించడానికి రాలేదు (మార్కు 10:45). చివరికి తాను చెప్పదలచిన, చేయవలసిన వాటిలో రాజీ పడేదే లేదని ప్రాణాల ను సహితం అర్పించాడు. మానవుల కోసం ఇంతగా పరితపించిన, జీవించిన నిజమైన ప్రజల మనిషి, మానవతా వాది చరిత్రలో మనకు కనిపించదు. దేశభక్తికి, ప్రపంచ ముక్తికి ఆయనను మించిన వ్యక్తి లేదు. ఆయన మళ్లీ వచ్చినప్పుడు సార్వభౌమ రాజుగా అన్ని దేశాలు అతనికి నమస్కరిస్తాయి (ఫిలిప్పీ2:9-11, ప్రకటన 11:15).

## నీవే దేవుని ఆశ

నేటి ప్రపంచ పరిస్థితి ఎలా ఉంది? అధికారి క అంచనాల ప్రకారమే ప్రపంచంలో ఎందరో అభాగ్యులు ఈ రోజుకీ ఏదో రీతిగా చీకటిశక్తుల పీడనకు గురవుతూనే ఉన్నారు. అనేక వర్ధమాన దేశములలో వెట్టిచాకిరీ చేస్తున్న బాలబాలికలు, కనీస వేతనములు లేని కోట్లాదిమంది పారిశ్రామిక కార్మికులు, వ్యభిచారపు రొంపిలో మగ్గుతున్న దాదాపు కొన్ని కోట్ల మందికి పైగా మహిళలు, అప్పుల ఊబిలో చిక్కుకొని తరతరాలుగా ఆర్థిక స్వేచ్ఛనెరుగని నిమ్నవర్గ ప్రజలు, దారిద్ర్యరేఖకు దిగువన పెరుగుతున్న పేదరికం, నరహంతక మత వౌఢ్యముతో ఛిద్రమైపోతున్న దేశాల ప్రజలు, దేశాల మధ్య సమాధానము లేని స్థితి, ఎల్లలు లేకుండా విస్తరిస్తున్న విగ్రహారాధన, నాస్తికత, త్రాగుబోతుతనం మాదక ద్రవ్యాలు, దుర్వ్యసనాలు, నేరప్రవృత్తి, అదుపులేని కామాతురత, సినిమా, ఫ్యాషన్స్, ఆకర్షణలు, మానవత్వము మరచిపోయిన ధనాపేక్ష, భోగాపేక్ష, రాజకీయ సామాజిక సంగతులు ఎన్నెన్నో.



సమస్త మానవ రుగ్మతలకు యేసుక్రీస్తు రూపములో దేవుడు పరిష్కారం ఇచ్చాడు. కానీ ఇతరులను అర్థం చేసుకోలేని హృదయం, ప్రార్థనకు ప్రాముఖ్యత ఇవ్వలేని క్రైస్తవులమైన మనం ఇలాంటి పెనుసవాళ్ళకు ఎలా స్పందిస్తాం?

దేవుడు మనల్ని ఒక ప్రయోజనం కోసం భారతదేశంలో ఉంచాడనే విషయాన్ని అర్థం చేసుకొని, ఆ ప్రకారం జీవిస్తూ మన దేశానికి దేవుని ఆశీర్వాదాన్ని తెచ్చేవారంగా ఉందాం.

– డా. మేడికొండ సాంబయ్య, పులివెందుల



# క్రైస్తవులు దేశానికి ఉపకారులా? అపకారులా?

విశ్వాసం విశ్వమంతా ఉంటుంది. సంస్కృతి ఒక భూభాగానికి పరిమితమై ఉంటుంది. ఇది సామాన్య స్పృహ. కానీ ఈరోజుల్లో ప్రతి ఒక్కరికీ విశ్వాసాన్ని, సంస్కృతిని కలబోసి మాట్లాడటం అలవాటైపోయింది. ముఖ్యంగా "భారతదేశంలో సంస్కృతికి, విశ్వాసానికి తేడా లేనే లేదన్న భావనను ఒక ప్రణాళికాబద్ధంగా భారతీయుల హృదయాల్లోకి బలవంతంగానే నెడుతున్నారు" అని అనిపిస్తోంది. విశ్వాసం, ప్రేమ, సహోదరభావం, సమానత, పరస్పర గౌరవంలాంటి అమలు చేయగల, అనుభవించగల, అదృశ్యమైన, వైశ్విక సత్యాలు సాంస్కృతిక నేపథ్యానికి మాత్రమే ఆగిపోక సరిహద్దులు ఏవీ లేక విశ్వవ్యాప్తంగా మానవాళి నిర్ధిష్టంగా ఒప్పుకునే అంశాలు. ఇవి ఎగుమతి, దిగుమతులకు ఆవల ఉన్న మానవ విలువలు. ఇవే క్రీస్తు రాజ్య విలువలు. వీటిని అనుసరించి సంపూర్ణ మానవత్వం వైపుకు ప్రయాణించడమే క్రైస్తవ్యం. ఏ దేశంలోనో పుడితే ఇవి వస్తాయన్న గ్యారెంటీ లేదు, ఏ దేశంలోనో ఉంటే వీటిని అమలు చేయకూడదన్న నియమమూ లేదు. సర్వమానవాళికి నైతికత, తర్కం, ఆలోచన, భావన మొదలైనవి జన్మసిద్ధంగా ఉంటాయి. దీన్నే దేవుని స్వరూపం, పోలిక అని బైబిల్ చెబుతుంది.

"కిరాయి మతం, దిగుమతి చేసుకొన్న మతం, అరువు తెచ్చుకున్న మతం" అని కులప్రధాన వాదసంస్కృతి అన్య మతాలను ఒక పక్క దూషిస్తూనే, మరో పక్క అమెరికా, రష్యా, చైనా, జపాన్ ఐరోపా మొదలగు ప్రాంతాల్లో వారి మత సామ్రాజ్యాలను బాబాలు, స్వామీజీల ద్వారా నిర్మించుకొంటుంది. "ఇదెక్కడి న్యాయం?" అని అడిగితే "భారతీయ సంస్కృతి అన్నిటికన్నా ముందునుండి ఉంది, కాబట్టి మేము వేరే దేశాల్లో మా మత విస్తరణ కోసం పాటు పడొచ్చు, కానీ వేరే మతాలు ఇక్కడ విస్తరిస్తే చూస్తూ ఊరుకోం" అంటూ డొంక తిరుగుడు మాటలు చెప్పటం గమనించగలం. ఏదేమైనా ఆలోచించాల్సిన విషయం ఏంటంటే... దిగుమతి చేసుకొన్న సబ్బు, పెన్ను, సూటు బూటు, భాష, బతుకు దెరువు, రేడియో, టీవీ, ఫోను, వ్యాను, ఇలా చూస్తూ పోతే ప్రతి సాంకేతిక ఉపకరణం, మన జీవన శైలిలోని ఎనభైశాతం దిగుమతి చేసుకున్నదే. పిల్లవాడి పుట్టుక నుండి, ముసలోడి చావు వరకు వాడే వస్తువు, భాష, చూసే బొమ్మ అన్నీ విదేశీ అయినప్పుడు మన సంస్కృతిలో అవి భాగమవ్వలేదని చెప్పడం ఎంత అజ్ఞానమో ఆలోచించండి.

ఈ దేశం– ఆ దేశం, ఈ సంస్కృతి – ఆ సంస్కృతి అన్న తేడా లేకుండా ప్రతి జాతి, ప్రతి భాష, ప్రతి సామాజిక వర్గాన్ని గౌరవించి వాటి మధ్య సమన్వయం, ఐక్యత, సోదరభావం పెంపొందిస్తూ సృష్టికర్త కోరుకొంటున్నట్టు మానవ సమాజాన్ని ఒకటి చేసే దేవుని రాజ్య ప్రతినిధులే క్రైస్తవులు. నిజంగా మనుషులుగా బతకడం ఎలాగో ప్రపంచానికి నేర్పించే భావజాలం అయిన బైబిల్ భావజాలాన్ని మోసుకొని తిరిగేవారే క్రైస్తవులు.


## మిషనరీస్ వల్ల దేశానికి కలిగిన ప్రయోజన మేంటి?

వీరి వల్ల దేశానికేమైనా ఉపయోగం ఉందా? చరిత్రలో వీరి ప్రాతినిధ్యం ఏంటి? దేశ నిర్మాణంలో వీరి పాత్ర ఏమిటి? అని ఆలోచిస్తే మనం చిన్న నాటినుండి చదివిన చరిత్ర వ్యాసాలలో క్రైస్తవ ప్రాతినిధ్యం కనబడదు. విద్యార్థులైన మీకు కావాల నే చరిత్రను దాస్తున్నారన్నది మీకు ఇదివరకే తెలిసి ఉండాలి. ఆర్‌సి మజుందార్ గారు మొదలుకొని నవ చరిత్ర కారుల వరకు ఐరోపా వ్యతిరేక చరిత్ర వివరణనే ప్రజలముందుకు ముఖ్యంగా విద్యార్థుల ముందుకు తీసుకొచ్చారు.

## సమానత్వం ప్రారంభమైంది

స్వరాజ్య పోరాటం జరిగే రోజుల్లో అసలు స్వరాజ్యం అంటే కేవలం అగ్రకులస్థులకు కావల సినది అధికార రాజ్యం మాత్రమే అన్న ఆలోచనను అంబేద్కర్ గారు తన ఉపన్యాసంలో చెప్పారు:

''మహాశయులారా! స్వరాజ్యమే గనుక వస్తున్నట్టయితే అందులో మనం సమానమైన రాజకీయ హక్కు పొందాలి. మనం అస్పృశ్యులం, ఇంకా బానిసలం కానందుకు అదృష్టంగా భావించాలి. అలా అయివుంటే వినిమయ వస్తువుల్లాగా, సంతలో సరుకుల్లాగా, పశువుల్లాగా అమ్ముడుపోయేవాళ్ళం. అయినప్పటికీ, ఈ రకమైన బానిసత్వంలో లేనందుకు మనం సంతృప్తి పడాల్సినపని కూడా లేదు." అంటూ అంబేద్కర్ గారు తన మనసులోని మాటను వ్యక్త పరిచారు (మరాఠి ప్రసంగం, కాన్ఫరెన్స్ ఆఫ్ డిప్రెస్డ్ క్లాసెస్ ఫ్రం బొంబాయి ప్రొవిన్స్, బార్సి, షోలాపూర్ జిల్లా). ఈ దేశంలో పశువుల్లాగా, వస్తువుల్లాగా ఉన్న జాతికి ఎప్పుడో రావాల్సిన సమానత్వం మెల్లిగా




అంబేద్కర్ గారి సమయానికి ప్రారంభం అయ్యింది. అది కూడా దేవుని రాజ్య మిషన్ ఎరిగిన మిషనరీ వ్యవస్థ తెచ్చిన సామాజిక, సాంస్కృతిక మార్పులే కారణం అని చెప్పక తప్పదు. "గ్రీసు, రోమాలో అమల్లో ఉన్న బానిసత్వంతో పోలిస్తే మన స్థితి ఎంతో మెరుగైనది. కానీ మరో కోణంలోనుంచి చూస్తే, అస్పృశ్యత అనేది బానిసత్వం కన్నా దారుణమైనది. బానిసలు విముక్తులై రాజ్యంలోని స్వేచ్ఛాయుత పౌరులుగా మారిన దృష్టాంతాలు చరిత్రలో కోకొల్లలు గా ఉన్నాయి. కానీ భారతదేశంలో అస్పృశ్యులు స్పృశ్యులైన ఉదాహరణ ఒక్కటి కూడా లేదు." అంటూ ఈ దేశంలో ఉన్న అసామాజిక స్థితిగతులకు అద్దం పట్టే విధంగా అంబేద్కర్ మాట్లాడారు.

## సమన్యాయం లభించింది

దేవుని రాజ్య భారం కలిగిన మిషనరీ వ్యవస్థ 1773 సం॥లో అందరికీ సమన్యాయం అన్న చట్టం ఈ దేశంలో ప్రవేశ పెట్టక ముందు ధర్మం నాలుగు పాదాల మీద నడవాలి అన్న నినాదంతో చాతుర్వర్ణ వ్యవస్థ ఆధారంగా అసమాన న్యాయ వ్యవస్థ కొన్ని వేల సంవత్సరాలు తాండవం చేసింది. దీన్ని మనం బడుల్లో బహుశా చాలా అరుదుగా చూసి ఉంటాం. 1795 సం॥లో శూద్రులకు ఆస్తి హక్కు లేక ముందు మన దేశంలో మన ప్రజలు ముఖ్యంగా బహు సంఖ్యాకులు అనగా నేటి 70% మంది ప్రజలకు కష్టపడే కర్మ ఉంది కానీ ఆస్తి సంపాదించే యోగం ఉండేది కాదు. ఇలాంటి సమయంలో, బైబిల్ బోధించే దేవుని రాజ్య భావజాలమే ఈ ఆస్తి హక్కు చట్టం రూపుదాల్చడానికి కారకమైంది. 1807 సం॥లో బానిసత్వ విముక్తి చట్టం ప్రవేశ పెట్టకపోతే బహుశా ఇప్పటికీ మనుష్యులను అమ్మడం, కొనడం ఈ సమాజంలో చూసే వాళ్ళమేమో. ఇంతకన్నా దౌర్భాగ్యమైన కుల ప్రాతిపదికన ఉన్న వివక్షను రూపు

మాపడానికి బైబిల్ భావజాలం గల దేవుని రాజ్య ప్రతినిధులు అహర్నిశలు పోరాటం చేశారు. వ్యవస్థల స్థాపన, చట్టాల మార్పు, సామాజిక విప్లవాలు విద్యా వ్యవస్థలో ఇంగ్లీష్ చదువులు చేర్చడం వంటి అనేక కార్యక్రమాల ద్వారా ఈ దేశంలోని మనుష్యులందరికీ నిజమైన దేవుని నివాస యోగ్యమైన సమాజాలుగా తీర్చిదిద్దే ప్రయత్నాన్ని, దేవుని రాజ్య నిర్మాణ ప్రయత్నాల్ని క్రైస్తవులు మొదలు పెట్టారు.

## విద్యాసంస్థల్ని ఏర్పాటుచేశారు

మిషనరీ విద్యా ప్రయత్నాలు బైబిల్ ఆధారంగా ప్రేరేపించబడి ఉండటం కారణంగా, కులాల మధ్య సమానతను స్థాపించాయి. ప్రజల మూఢ నమ్మకాలను తొలగించి, సమాజంలోని వర్గాలను సమానంగా నిలబెట్టడం ద్వారా సమాజంలోని భిన్న జాతుల ప్రజలు స్వీయ-గౌరవంతో జీవిస్తారన్న భావజాలాన్ని మిషనరీస్ వ్యాప్తి చేశారు. భారతదేశంలోని ఇతర ప్రాంతాలకంటే, మిషన్ విద్యా సంస్థలు బహుశా మద్రాస్ ప్రెసిడెన్సీలో ఎక్కువ ప్రభావాన్ని చూపాయి. 1901 సంll చివరిలో 3,778 కంటే ఎక్కువ సంఖ్యలో ప్రైవేట్‌గా నిర్వహించే విద్యా సంస్థలను గుర్తించారు.

| స్కూల్/కాలేజి | మిషనరీలు నిర్వహించేవి | ప్రైవేట్ వ్యక్తులు నిర్వహించేవి |
|---|---|---|
| ఆర్ట్స్ కాలేజీలు | 22 | 11 |
| మాధ్యమిక పాఠశాలలు బాలురకు | 182 | 208 |
| మాధ్యమిక పాఠశాలలు బాలికలకు | 135 | 13 |
| ప్రాథమిక పాఠశాలలు బాలురకు | 3016 | 13371 |
| ప్రాథమిక పాఠశాలలు బాలికలకు | 371 | 281 |

(మూలం: ఫోర్త్ క్విన్క్వెనియల్ రివ్యూ (1887-98 నుండి 1901-02 వరకు), వాల్యూమ్ - 1, పేజ్ 41)

విద్య, వైద్య సహాయం మరియు సామాజిక సే-వను అందించడం ద్వారా మిషనరీ వ్యవస్థ తక్కువ




కులాలకు గౌరవం ఇచ్చి, హిందువులు ఈ కులాలను దీర్ఘకాలంగా విస్మరించడం గురించి కళ్ళు తెరిచేలా చేసింది. ఈ పని వారిని క్రైస్తవ మతానికి మారి సమాజం యొక్క విప్లవాత్మక పరివర్తనలో భాగంగా మతపరమైన ఉన్నత హోదాను పొందడానికి ప్రోత్సహించింది. అంతేకాక, ఆంధ్ర ప్రాంతంలో క్రైస్తవ మిషనరీ విద్య యొక్క ఉద్దేశాలు ఎప్పుడూ పూర్తిగా లౌకికమని గుర్తించాలి.

## మరెందుకీ ద్వేషం?

సామాన్య ప్రజలలో రాజకీయ లాభం కోరుకొని విభజించి పాలించాలి అనే భావజాలంతో బూచిని చూపించి పిల్లలతో పని చేయించుకొన్నట్టు మైనారిటీలను చూపించి మెజారిటీ ప్రజలను నియంత్రణలో ఉంచుకునే పద్ధతి మన దేశంలో గత దశాబ్దాలన్నిటా చూస్తూనే వస్తున్నాం. రాజకీయ లాభానికి ఉపయోగపడే విధంగా పత్రికలు కూడా తోడైతే, టీవీలు సినిమాలు కూడా అదే కథను అనుసరిస్తే నిదానంగా ఆ విషయం సత్యం అయిపోయే లేక సామాజిక సెంటిమెంట్ అయిపోయే అవకాశం ఉంటుంది. ప్రస్తుత భారతీయ రాజకీయం ఇదే. ఉత్తరాదిన ముస్లింలంటే ఉగ్రవాదులు, క్రైస్తవులంటే మతమార్పిడి మాఫియా అన్న తప్పుడు వార్తను గత 25 సంవత్సరాలనుండి అగ్గి రాజేస్తూనే ఉంది. ఇదే కోవలో 'ఏమార్చే మతం' అనే శీర్షికతో తెలుగు పాఠకులకు ఒక దినపత్రిక క్రైస్తవులపై తన అక్కసు వెలగబోస్తూ పై మాటల హితవు పలకడం నవంబరు 10 వ తారీకు 2011 న చోటుచేసుకుంది. ఆ తరువాత తన మీడియా ఛానల్‌లో కూడా క్రైస్తవ విరోధ కార్యక్రమాలు తరచూ చేస్తూనే వచ్చారు. మనిషి మనిషిగా బతకాలని కబుర్లు చెప్పే ఇలాంటి పత్రికలు ఆ మనిషికి ఉన్న జన్మ హక్కులను ప్రశ్నించడం దేనికి? తనకు ఇష్టం వచ్చిన మతాన్ని,

ఆకలైన వాడికి కేవలం అన్నం పెట్టడమే కాకుండా అన్నం ఎలా సంపాదించాలి అని చెప్పే/తర్ఫీదు నిచ్చే క్రైస్తవ మిషనరీ సంస్థలు చేసే తప్పేంటో తెలియడం లేదు. విమర్శించే వ్యవస్థల దగ్గర మానవుల పట్ల అంత ప్రేమ ఉంటె తామెందుకు సామాజిక పురోగతికోసం క్రైస్తవులవలె పాటుపడరు?



ఆచారాన్ని పాటించడం మనిషికి జన్మ హక్కుకాదా? తన భావాలను, తను నమ్మే సిద్ధాంతాలను పది మందితో పంచడం మత మార్పిడా? పత్రిక అనే మీడియా చాటున రాసిన ఈ మాటలు కోట్లాది ప్రజల ను ప్రభావితం చేసి వారి మనసులను కలుషితం చేసి ఒక సామాజిక వర్గంపై చిన్న చూపు చూసే కొత్త "మతం" సృష్టించడమే అవుతుంది కదా? బుద్ధి చెప్పి గడ్డి తినడం అంటే ఇదే మరి.

మధ్యప్రదేశ్, ఒడిశా, హిమాచల్‌ప్రదేశ్‌వంటి రాష్ట్రాలలో చేసిన రెలిజియస్ ఫ్రీడం యాక్ట్ చట్టం అప్రజాస్వామికం, రాజ్యాంగ విరుద్ధం అయినప్పటికీ చట్టం చట్టమే కాబట్టి క్రైస్తవులు ఆ చట్టానికి కట్టుబడి తమ మత ప్రచారం చేస్తున్నారు. అయినప్పటికీ ఒక సామాజిక వర్గాన్ని అణగదొక్కాలి అనే ఆలోచన ఉంటే చట్టం న్యాయం కనపడవు.

మనిషి మనిషిలా బతకాలని అన్ని మతాలూ చెబితే, క్రైస్తవ్యం "కేవలం చెప్పడం" కాకుండా మనిషిని మంచి మనిషిగా మార్చి చూపిస్తుంది. అలా మంచి మనుషులుగా మారే వారిని మతం మార్చుకున్నారని కొంతమంది గగ్గోలు పెడుతున్నారు. మానవ జీవితం విలువైనదని, సమాజం అంటే నేనొక్కడినే కాదు నాతో పాటు అందరూ అన్న సత్యం క్రైస్తవ్యం నేర్పి స్తుంది కనుక అందరి కోసం బతకడం, అందరికీ సేవ చేయడం, చేతనైనంత సహాయం సమాజానికి చేయడం క్రైస్తవుని బాధ్యతగా వారు గుర్తిస్తున్నారు. ఇలా చేయడం మేలైనదే కదా!

## అగ్ర వర్ణం, దళితకులం

ఇన్నాళ్ళూ కేవలం దళితులే క్రైస్తవులన్న ప్రచారం చేసిన సమాజం ఇప్పుడు దళితేతరులు (అగ్రవర్ణాలు) కూడా క్రైస్తవ్యంపై విశ్వాసం చూపించడంతో మీడియా ఇక తట్టుకోలేనట్టుంది. అందుకే తన పోరాటాన్ని క్రైస్తవులమీద ఉధృతం చేస్తోంది. విద్య, వైద్యం, చావు, ఆకలి అనే అన్నిరకాల అవస్థలను వాడుకొని క్రైస్తవులు మతం మారుస్తున్నారు అనేది క్రైస్తవ వ్యతిరేఖ మీడియాల వాదన. అందుకు ఉదాహరణగా కొన్ని కల్పిత కథనాలు చెబుతోంది మీడియా. అయినప్పటికీ ఆకలైన వాడికి కేవలం అన్నం పెట్టడమే కాకుండా అన్నం ఎలా సంపాదించాలి అని చెప్పే/తర్ఫీదు నిచ్చే క్రైస్తవ మిషనరీ సంస్థలు చేసే తప్పేంటో తెలియడం లేదు. విమర్శించే వ్యవస్థల దగ్గర మానవుల పట్ల అంత ప్రేమ ఉంటె తామెందుకు సామాజిక పురోగతికోసం క్రైస్తవుల వలె పాటుపడరు? సమాజంలో వైద్యం అవసరం అయితే ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయి, విద్య కోసం ప్రభుత్వ బడులు ఉన్నాయి, మనుషులు చనిపోతే ప్రభుత్వం చనిపోయిన వారిని దహనం చేస్తుంది. ఇలా అన్ని రకాలుగా ప్రభుత్వం చేసే పనులు అందరికి అందుబాటులో ఉన్నప్పుడు క్రైస్తవులు మేమేదో చేస్తాం అనగానే ప్రజలు నమ్మి వారి తాతలు, తండ్రులు అవలంభించే మతాన్ని కూడా వదిలేస్తారు అని చేసే ఈ మీడియా వాదన సరైనదేనా?

అంటే ఈ మీడియా వ్యవస్థకు, వారి విలేఖరులకు తప్ప ఇంకెవరికీ వివేకం లేదు, మతపరమైన అవగాహన, విచక్షణ లేదు అని మీరు వాదిస్తున్నారా? సమాజానికి, దేశానికి ఉపయోగపడే పనులు చేసే వారిని దేశ ద్రోహులుగా చిత్రీకరించడం, వారి పట్ల సమాజంలో విషం చల్లడం ఎంత వరకు సబబు అంటారు. దళితుల దేవుడు యేసు, దళితుల మతం క్రైస్తవ్యం అని చెప్పుకొని, దళితులు క్రైస్తవ్యమును పొంది వారి ప్రగతికి క్రైస్తవ్యం ఇచ్చిన ప్రోద్బలం చూస్తే ఈ మతం ఏమ్మార్చిందో ఇట్టే తెలిసి పోతుంది. క్రైస్తవులు నువ్వు యేసును నమ్మితే మేలు జరుగుతుంది అని చెప్పటం నిజమే. ఎందుకంటే వారు దాన్ని సత్యం అని నమ్ముతారు కాబట్టి చెబుతారు. అలాగే అన్ని మతాల వాళ్ళూ చెబుతారు. క్రైస్తవులకు మాత్రమే ఆ పుణ్యం/పాపం అంటగట్టడం అవివేకం.

మిగిలినది వచ్చే సంచికలో...

**- ప్రవీణ్ కుమార్ పగడాల,** హైదరాబాద్

# బానిసత్వం నుండి స్వాతంత్ర్యానికి...




కొలస్సీ అనే పట్టణంలో ఫిలేమోను అనే ఒక క్రైస్తవ ధనవంతుని గృహములో ఒనేసీము అనే బానిస ఉండేవాడు. అతను తన యజమానుని ఇంట్లో దొంగతనం చేసి సుమారు 1000 మైళ్ళ దూరంలో ఉన్న రోమా పట్టణానికి పారిపోయి చివరికి అరెస్టయ్యి రోమా చెరసాల పాలయ్యాడు. అయితే ప్రేమగల దేవుడు అతనికి నిజమైన స్వాతంత్ర్యాన్ని అనగా పాప బానిసత్వం నుండి విడుదలను అదే చెరసాలలో ఉన్న అపొస్తలుడైన పౌలు ద్వారా ప్రసాదించాడు. పౌలు ద్వారా సువార్తను విని ఆ చెరసాలలోనే మారుమనస్సు పొంది క్రీస్తు ఇచ్చే నిజమైన స్వాతంత్ర్యాన్ని అనుభవించాడు.

శిక్ష పూర్తయిన తర్వాత పౌలు ఈ ఒనేసీమును అంగీకరించమని, క్షమించమని తన యజమానుడైన ఫిలేమోనుకు ఒక సిఫారసు లేఖను రాశాడు. ఆ పత్రికే బైబిల్ గ్రంథంలో ఉన్న ఫిలేమోను పత్రిక.

ఈ ఉత్తరాన్ని అందుకున్న ఫిలేమోను సంతోషంతో, క్షమాపణ మనస్సుతో ఒనేసీమును స్వీకరించాడని, తర్వాత ఒనేసీము బెరయ సంఘానికి ఒక బిషప్పుగా మారాడని, క్రీస్తు కొరకు హతసాక్షి అయ్యాడని కొన్ని యూదా సాంప్రదాయ గ్రంథాల్లో రాయబడింది.

**పూర్వం ఫిలేమోను గృహంలో ఒనేసీము:**

1. బానిస (ఫిలే 15వ - దాసుడు)
2. దొంగ (ఫిలే 18వ - నష్టము కలుగజేసినవాడు)
3. నిష్ప్రయోజకుడు (ఫిలే 11వ)

**క్రీస్తులో ఒనేసీము:**

1. సహోదరుడు
2. నమ్మకమైన పరిచారకుడు
3. ప్రయోజకుడు

**పాప బానిసత్వం:**

యోహాను 8:34 ప్రకారం “పాపము చేయు ప్రతివాడు పాపమునకు దాసుడు” అని ప్రభువైన యేసుక్రీస్తు చెప్పాడు. అవును నీవు ఏ పాపం చేస్తు న్నావో దానికి నీవు బానిసవు. అది లేనిదే, దాన్ని చూడందే, అక్కడికి వెళ్ళందే నీవుండలేవు. అదే పాప బానిసత్వం. అరిస్టాటిల్ అనే గ్రీకు తత్వవేత్త “మానవుడు స్వేచ్ఛగానే జన్మించాడు గానీ జీవితమంతా బానిస బతుకు బతుకుచున్నాడు” అని అన్నాడు. ఇది ముమ్మాటికి నిజం.

నేటి యువతీ యువకులు అనేకరకాల దుర్వ్యసనాలకు బానిసలుగా, శాంతి సమాధానం లేకుండా జీవిస్తూ నరకానికి వెళ్ళే మార్గంలో ఉన్నారు. కొందరు సినిమాలకు, సీరియళ్ళకు, ప్రేమకు, మత్తు పదార్థాలకు, డ్రగ్స్‌కు, అశ్లీల చిత్రాలకు, టీవీలకు, ఇంటర్నెట్‌కు, స్మార్ట్‌ఫోన్‌లకు బానిసలైపోయారు. ఈ పాపబానిసత్వం నుండి బయటపడలేక కొందరు తమ యవ్వన జీవితాలను ఆత్మహత్యల ద్వారా అంతం చేసుకుంటున్నారు. “పాపం చేయకముందు అందంగా, ఆకర్షణీయంగా కనబడుతుంది. పాపం చేసే సమయంలో ఆనందంగా, ఆహ్లాదంగా ఉంటుంది. తీరా చేశాక ఆవేదన, ఆక్రందన మిగుల్చుతుంది.

2022 సం॥ల క్రితం ఈ పాప బానిసత్వం నుండి మానవుల్ని విడిపించడానికి, నిజమైన స్వాతంత్ర్యం, జీవితానికి విలువ ఇవ్వడానికి దేవుడు ప్రభువైన యేసుక్రీస్తుగా ఈ లోకానికి వచ్చి సిలువలో మానవుల పాపశిక్షను భరించి చనిపోయి తిరిగి లేచాడు. నీవు ఎలాంటి పాపానికి బానిసవైనా యేసుక్రీస్తు నిన్ను విడిపించగలడు. నీకు నిజమైన స్వాతంత్ర్యాన్ని యేసు మాత్రమే ఇవ్వగలడు. గనుక సత్యమైన యేసుక్రీస్తును మీ జీవితంలో అంగీకరిస్తే మిమ్మల్ని స్వతంత్రులనుగా చేస్తాడు (యోహాను 8:32).

**- రెవ. డి. రాము,** మోపర్రు

## భారతదేశ స్వాతంత్ర్యం

# క్రైస్తవ నాయకత్వం


భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచాయి. మన క్రైస్తవ సమాజం దేశానికి చేసిన సేవల గురించి చట్టబద్ధంగా గర్వపడడానికి చాలా కారణాలు ఉన్నాయి. స్వాతంత్ర్యానికి ముందు, తరువాత భారతదేశ జనాభాలో 2.3 శాతంగా ఉన్న క్రైస్తవులు విశిష్టమైన రీతిలో దేశ అభివృద్ధికి దోహదపడ్డారు. భారతదేశ అభివృద్ధి యొక్క ప్రతి రంగంలో ముఖ్యంగా పేదల అభివృద్ధిలో క్రైస్తవ సంఘం కీలక పాత్ర పోషిస్తోంది. కానీ భారతదేశంలోని సంఘం సురక్షితంగా లేదు. ముఖ్యంగా కొన్ని సంస్థలు క్రైస్తవ సమాజాన్ని దూషిస్తూ, వారిని హింసలకు గురిచేస్తున్నాయి. విద్య, వైద్యం, ఆరోగ్యం మొదలైన సామాజిక రంగాలలో ప్రధాన సహకారం ఉన్నప్పటికీ, ద్వేషపూరిత రాజకీయాలు, దుర్మార్గపు ప్రచారాల కారణంగా క్రైస్తవ సమాజం అభద్రతలో ఉంది. గమనించాల్సిన విషయం ఏంటంటే, సమాజంపై దాడి చేసే వారు భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో, ఆదివాసీలు, దళితుల అభివృద్ధి పోరాటాలలో ముందంజలో లేరు. చరిత్రను గమనిస్తే క్రైస్తవ సమాజం దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వ్యక్తులతో జతకట్టడంలో చురుకుగా ఉందని తెలుస్తుంది.

### క్రైస్తవ్యం పాశ్చాత్యం కాదు

క్రైస్తవ మతం పాశ్చాత్య మతం అనేది ఒక ఆధారం లేని ఆరోపణ. యేసుక్రీస్తు జన్మస్థలం ఐరోపాలో కాదు, మధ్యప్రాచ్యంలో ఉంది. భారతదేశాన్ని క్రైస్తవ మతంలోకి మార్చడంలో క్రైస్తవులు బ్రిటిష్ వారితో జతకట్టారనే ఆరోపణలు ఎంతమాత్రం వాస్తవం కాదు. బ్రిటిష్ పాలకులకు విశ్వాసం ఉండవచ్చు కానీ వారు క్రైస్తవులు కాదు. వారి లక్ష్యం మతం మార్చడం కాదు, ప్రపంచవ్యాప్తంగా కాలనీలను సృష్టించడం. వారు మతపరమైన లక్ష్యంతో కాకుండా, ఆర్థిక లక్ష్యంతో వచ్చారు. చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా లేదా భారతీయ క్రైస్తవులు బ్రిటిష్ వారి నుండి ఎలాంటి అనుగ్రహాన్ని పొందలేదు. మొదటి నుండి వలసవాదులు మతాన్ని ప్రోత్సహించడానికి నిరాకరించారు. ఎందుకంటే, మిషనరీ సంస్థలతో జతకడితే తమ ఆర్థిక లక్ష్యం విఫలమవుతుందని వారు ఆందోళన చెందారు. బ్రిటీష్, ఇతర వలసవాదుల ప్రధాన లక్ష్యం మతమార్పిడి అయితే, దేశంలో కేవలం 2.3 శాతం కంటే ఎక్కువ మంది క్రైస్తవులు ఉండాలి.



## స్వాతంత్ర్య ఉద్యమం-మిషనరీలు



బ్రిటిష్ పాలనను పూర్తిగా వ్యతిరేకించిన మొదటి వ్యక్తి, బ్రిటిష్ క్రైస్తవ మతగురువు చార్లెస్ ఫ్రీర్ ఆండ్రూస్ (ఫిబ్రవరి 12, 1871–ఏప్రిల్ 5, 1940). ఈయన చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు చెందిన ఒక సంఘ కాపరి, మిషనరీ, విద్యావేత్త, సంఘ సంస్కర్త. ఈయన మహాత్మాగాంధీ యొక్క సన్నిహిత మిత్రుడు. గాంధీ పౌర హక్కుల పోరాటానికి నాయకత్వం వహిస్తున్న దక్షిణాఫ్రికానుండి భారతదేశానికి తిరిగి వచ్చేలా గాంధీని ఒప్పించడంలో ఈయన పాత్ర ఎంతో ఉంది. 1906 సం॥ నాటి భారత జాతీయ కాంగ్రెస్ కార్యకలాపాల్లో ఆయన పాలుపంచుకున్నారు, 1913 సం॥ మద్రాసులో పత్తి కార్మికుల సమ్మెను పరిష్కరించడానికి కూడా ఎంతో సహాయం చేశాడు.

బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారతీయ స్వాతంత్ర్య ఉద్యమానికి పూర్తి మద్దతునిచ్చిన క్రైస్తవ మిషనరీలు ఉన్నారు. ఈ మిషనరీలలో బాగా తెలిసిన పేర్లు: స్టాన్లీ జోన్స్, జె.సి. విన్స్‌లో, వారియర్ ఎల్విన్, రాల్ఫ్ రిచర్డ్ కీథాన్, ఎర్నెస్ట్ ఫారెస్టర్-పాటన్. స్వాతంత్ర్య పోరాటానికి మద్దతు ఇచ్చినందుకు కొంతమంది మిషనరీలను భారతదేశంనుండి బహిష్కరించారు.

## ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌లో క్రైస్తవ నాయకులు

క్రైస్తవ నాయకుల ప్రభావం 1885 నుండి భారత జాతీయ కాంగ్రెస్ యొక్క వివిధ సమావేశాలలో ఎంతో ఉంది. రెవ. కాలిచరన్ బెనర్జీతో పాటు లాహోర్ నుండి జి.సి. నాథ్, మద్రాస్ (ప్రస్తుత చెన్నై) కు చెందిన పీటర్ పాల్ పిళ్ళై, 1888-1891 మధ్య కాంగ్రెస్ యొక్క నాలుగు సమావేశాల్లో భారత క్రైస్తవులకు ప్రాతినిధ్యం వహించి, ప్రారంభ సంవత్సరాల్లో ప్రముఖ నాయకులుగా వ్యవహరించారు. 1889 సం॥లో, భారతీయ ఉపాధ్యాయులు జాతీయ ఉద్యమాలలో పాల్గొనకుండా నిషేధించబడాలనే తీర్మానాన్ని వారు తీవ్రంగా నిరసించారు. 1887 సం॥లో జరిగిన కాంగ్రెస్ యొక్క మూడవ వార్షిక సమావేశంలో పాల్గొన్న 607 మందిలో, 15 మంది క్రైస్తవులు. అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించిన వారిలో మధు సుధాన్ దాస్ (1848–1934, 'ఉత్కల్ గౌరాబ్' అని పిలుస్తారు), ఈయన ఒడిశా క్రైస్తవ సంఘానికి చెందిన ప్రసిద్ధ నాయకుడు. 1889 సం॥ కాంగ్రెస్‌లోని పది మంది మహిళా ప్రతినిధులలో, ముగ్గురు క్రైస్తవులు: పండిత రామాబాయి సరస్వతి (1858–1922), శ్రీమతి త్రయంబక్, శ్రీమతి నికాంబే ఉన్నారు.


## స్వరాజ్ ఉద్యమంలో క్రైస్తవులు

1930 సం॥లో భారతీయ క్రైస్తవుల ప్రధాన సమావేశం బొంబాయిలో జరిగింది. అక్కడ వారు అనేక తీర్మానాలను ఆమోదించారు. భారతదేశ పూర్తి స్వరాజ్యం కోసం పోరాడాలని వారు తీర్మానించారు. 1931 సం॥లో, రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ కోసం మహాత్మా గాంధీ బయలుదేరిన సందర్భంగా, వారు ఒక మెమోరాండం సమర్పించారు.

1944వ సం॥లో భారతదేశంలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ చర్చ్‌ల సమావేశంలో, కౌన్సిల్ 'యుద్ధానంతర భారతదేశంలో చర్చ్ అండ్ స్టేట్' పై ఒక ప్రకటనను వెలువరించింది. స్వరాజ్ ఉద్యమం (1905), సహాయ నిరాకరణ ఉద్యమం (1920), శాసనోల్లంఘన ఉద్యమం (1930), 'క్విట్ ఇండియా' ఉద్యమం (1942)లో క్రైస్తవులు చురుకుగా పాల్గొన్నారు. 1920 సం॥ నుండి, అనేక క్రైస్తవ సంస్థలు స్వాతంత్ర్య ఉద్యమానికి పూర్తి సంఘీభావం వ్యక్తం చేసి కొందరు బ్రిటిష్ వలస ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ఉద్యమాలలో కూడా పాల్గొన్నారు. సంఘాలకు అనుబంధంగా ఉన్న విద్యాసంస్థల విద్యార్థులు స్వరాజ్ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.

## సామాజిక సంస్కరణలు

భారతదేశంలో కొనసాగుతున్న సతీసహగమనం,



అంటరానితనం, కుష్ఠురోగులను చంపడం, పసి బిడ్డలను బలివ్వడం మొదలైన సాంఘిక దురాచారాల పట్ల మొదటి నుండి మిషనరీలు దృష్టి సారించారు. 1793 సం॥లో విలియం కేరీ భారతదేశానికి వచ్చినప్పటినుండి శిశుహత్య, సతీసహగమనం, అంటరానితనం సమస్యలపై చురుకుగా పోరాడారు. ఒకవైపు అధికారంలో ఉన్నవారితో, అధికారంలో లేనివారితో తనకున్న సంబంధాలను ఉపయోగించుకుని, అలాంటి పద్ధతులను చట్టవిరుద్ధంగా ప్రకటించాలని ప్రచారం చేస్తూనే, మరోవైపు మానవతా ఆందోళనకు సంబంధించిన విషయాలపై ప్రజాభిప్రాయాన్ని తెలియజేయడానికి తన ప్రచురణలను ఉపయోగించుకొన్నాడు. 1814 నాటికి రాజా రామ్ మోహన్ రాయ్ సతీసహగమనానికి వ్యతిరేకంగా ప్రచారంలో విలియం కేరీకి తన మద్దతును ఇచ్చాడు. ఆ దినాలలో జరిగిన 438 వితంతువుల దహనానికి సంబంధించిన వివరాలతో పోరాటానికి సన్నద్ధమయ్యారు. కేరీ, అతని సెరాంప్రే సహచరులు ఈ ఆచారాన్ని చట్టం ద్వారా నిషేధించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. సంపన్న వర్గాల హిందూ నాయకుల నుండి తీవ్ర వ్యతిరేకత కారణంగా మొదట్లో చాలా తక్కువ పురోగతి సాధించినప్పటికీ, చివరికి ప్రజాభిప్రాయం సనాతన హిందువులకు వ్యతిరేకంగా మారింది. 1829 సం॥లో లార్డ్ విలియం బెంటింగ్ చివరకు ఈస్ట్ ఇండియా కంపెనీ సతిని నిషేధిస్తూ ఒక ఉత్తర్వుపై సంతకం చేశాడు.

మానసిక, శారీరక వికలాంగుల కోసం చర్చ్ సంస్థలను ఏర్పాటు చేసింది. కాథలిక్, ప్రొటెస్టెంట్ క్రైస్తవులు భారతదేశం అంతటా వదిలివేయబడిన, దుర్వినియోగం చేయబడిన, దోపిడీకి గురైన వారి కోసం అనేక గృహాలను స్థాపించారు. బాల్య వివాహాల ఆచారానికి వ్యతిరేకంగా క్రైస్తవ సంఘం పోరాడింది. 1929 సం॥లో బాల్య వివాహాలపై నిషేధం విధించిన తర్వాత, చర్చ్ వితంతు పునర్వివాహానికి ఆమోదం తెలిపేందుకు గట్టి ప్రయత్నం చేసింది. దీనికి పరిష్కారమైన స్త్రీ విద్యను ప్రోత్సహించింది. క్రైస్తవ సంస్కరణలలో భాగంగా క్షయ రోగులకు, కుష్ఠు వ్యాధి సోకిన వారి కోసం శానిటోరియాలను ఏర్పాటు చేయడం జరిగింది.


## గ్రామీణాభివృద్ధి

క్రైస్తవ సంఘం ముఖ్యమైనదిగా భావించే మరొక అంశం గ్రామీణాభివృద్ధి. అలహాబాద్ (అలహాబాద్ వ్యవసాయ కళాశాల), తమిళనాడులోని సేలం సమీపంలో రెండు వ్యవసాయ కళాశాలల స్థాపనతో "గ్రామీణ పునర్నిర్మాణం" కోసం ప్రయత్నాలు జరిగాయి. బాసెల్ మిషన్, మంగుళూరులోని తన ప్రధాన కార్యాలయంనుండి పనిని ప్రారంభించింది, గ్రామ గృహ నిర్మాణాన్ని మెరుగుపరచడానికి చౌకైన టెర్రకోట టైల్స్, ఇతర సంబంధిత ఉత్పత్తుల తయారీని భారతదేశానికి పరిచయం చేయడంలో ప్రసిద్ధి చెందింది. ఇటువంటి పలకలు ఇప్పటికీ ప్రసిద్ధిలో ఉన్నాయి. వాటిని ఎవరు ఉత్పత్తి చేసినా, మిషన్‌టైల్స్‌గా పిలుస్తారు.

క్రైస్తవ సంఘం ప్రభావాన్ని చూపిన మరొక అంశం స్త్రీ విద్య. ఈ పనిలో ఎక్కువ భాగం ప్రారంభ మిషనరీల భార్యలు, ఒంటరి మహిళా మిషనరీస్‌తో నిర్వహించబడింది. అనేక గ్రామాలలో అణగారిన వర్గాలకు విద్య, ఉపాధి కల్పించడంలో క్రైస్తవులు మొట్టమొదట ఉన్నారు.

## ఆధునిక విద్యకు మూలకర్తలు

భారతదేశానికి క్రైస్తవ సంఘం అందించిన ఇతర ప్రధాన సహకారం ఏంటంటే, స్వాతంత్ర్యానికి ముందు, తరువాత యువతీ యువకులు ఆధునిక విద్యను పొందారు. నేటికీ క్రిస్టియన్ కళాశాలలు దేశంలోని అత్యుత్తమ ర్యాంక్‌లను కలిగి నాణ్యమైన విద్యకు ప్రసిద్ధి చెందాయి. భారతదేశంలోని అనేక తరాల క్రైస్తవేతర, అలాగే క్రైస్తవులు, ఉన్నతవర్గాలు, సామాన్యులకు విద్యనందించాయి. కొన్ని మతవాద సంస్థలు ఆరోపించినట్లుగా, ఈ సంస్థలు చేసే మత మార్పిడుల గురించి వ్యవస్థలోని వారికి ఎటువంటి ఫిర్యాదులు లేవు. పాఠశాలలకు తోడుగా ప్రింటింగ్ ప్రెస్‌లు వచ్చాయి, ఇవి అన్ని రకాల సాహిత్య



వ్యాప్తికి సహాయపడుతున్నాయి. పాఠ్యపుస్తకాలు, నిఘంటువులు, వ్యాకరణాల తయారీకి, విద్యాభివృద్ధికి అత్యుత్తమ కృషి చేసినందుకు భారతదేశం మిషనరీస్‌కు రుణపడి ఉంది.

## ఆరోగ్య సంరక్షణ

క్రైస్తవులు భారతదేశం యొక్క ఆరోగ్య సంక్షేమం, వైద్య రంగంలో గణనీయమైన సహకారాన్ని అందించారు. పంతొమ్మిదవ శతాబ్దంలో వివిధ రకాల వైద్య సంస్థలు భారతదేశం అంతటా స్థాపించబడ్డాయి. వీటిని దాదాపుగా మిషనరీ సంస్థలే ఏర్పాటు చేశాయి. వీటిలో రెండు అంతర్జాతీయంగా గుర్తింపు పొందాయి. మొదటిది, 1893సం॥లో డాక్టర్ ఎడిత్ బ్రౌన్ చేత స్థాపించబడిన లూధియానాలోని క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ హాస్పిటల్. మరొకటి, క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ హాస్పిటల్ వెల్లూర్, డాక్టర్ ఇడా స్కడ్డర్ యొక్క రోడ్‌సైడ్ క్లినిక్‌లనుండి 1895 లో ప్రారంభమైంది. ఈ రెండు ఆసుపత్రులు మొదట మహిళలకు, తరువాత పురుషుల కోసం ఏర్పాటు చేయబడ్డాయి. ప్రభుత్వ గుర్తింపు పొందిన మొదటి వైద్య కళాశాలలు గా పేరుపొందాయి. చర్చి-అనుబంధ సంస్థలు ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రుల ద్వారా లక్షలాది మంది వైద్య సేవల్ని పొందారు.

గ్రామాల స్థాయిలో, అనారోగ్యాన్ని, బాధలను నయం చేయడానికి అనేక మారుమూల ప్రాంతాలలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాలతో చర్చి పనిచేసింది. నేటికి కూడా దేశం యొక్క మారుమూల ప్రాంతాల్లో క్రైస్తవ సంస్థలు వైద్య పరిచర్యను కొనసాగిస్తున్నాయి.

## గిరిజనులు

ఈశాన్య భారతదేశంలోని గిరిజనులు ఈనాడు ఒక గౌరవాన్ని, గుర్తింపును సంపాదించడానికి మూల కారణం అక్కడ క్రైస్తవ మిషనరీలు చేసిన పరిచర్య. జార్ఖండ్‌లో గిరిజనులు చర్చ్ యొక్క కార్యక్రమాలకు కృతజ్ఞతలు తెలియజేస్తారు. ఈ ప్రాంతాలలో చర్చ్ యొక్క సంస్థలలో విద్యాభ్యాసం చేసి, జాతీయ నేతలు గా ఎదిగిన దళిత నాయకులు ఎందరో ఉన్నారు.

## ముగింపు

క్రైస్తవ సమాజం చాలా తక్కువగా ఉన్నప్పటికీ, అనేక సామాజిక, వేదాంత, వైద్య, విద్యా సంస్థల ద్వారా దేశ నిర్మాణానికి ఎంతో సహకారాన్ని ఇచ్చింది. హేతుబద్ధత, మానవతావాద దృక్పథంతో "నిజమైన ఆధునిక భారతీయులను" సృష్టించడంలో క్రైస్తవ సంఘం ముఖ్యమైన పాత్రను పోషించింది. సాయుధ దళాలు, పౌర సేవలు, విద్య, పోలీస్‌లు, సైన్స్, పరిపాలన, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, రాజకీయాలు మొదలగు విషయాల్లో దేశానికి ఎంతో సేవ చేసింది. పేదలకు నిర్మాణాత్మకంగా సేవ చేయడానికి, అట్టడుగు వర్గాలకు అధికారం ఇవ్వడానికి క్రైస్తవ సంఘం ఎంతో కృషి చేసింది. స్వాతంత్ర్యానికి ముందు క్రైస్తవ సామాజిక కార్యక్రమాలలో ఎక్కువ భాగం విదేశీ మిషనరీస్ మార్గదర్శకత్వం వహించారు. స్వాతంత్ర్యం తరువాత భారత క్రైస్తవులు వాటిని కొనసాగించారు, వారికి అప్పగించిన వారసత్వాన్ని కూడా కొనసాగిస్తున్నారు. ఆవిధంగా దేశభక్తి క్రైస్తవ ధర్మంగా కొనసాగుతోంది.

**- రూత్ వినయ్,** ప్రగతినగర్, హైదరాబాద్

'If my people, who are called by my name, will humble themselves and pray and seek my face and turn from their wicked ways, then will I hear from heaven and will forgive their sin and will heal their land'

- 2 Chron7:14

అవగాహన



# భారతదేశం ఎదుర్కొంటున్న సమకాలీన సవాళ్ళు

## ఉపోద్ఘాతం

రాత్రి 8 గంటలు. మార్చి 24, 2020. భారతదేశ ప్రధానమంత్రిగారు టీవీలో ప్రసంగిస్తున్నారు. ఆ రాత్రి 12 గంటలనుంచి దేశవ్యాప్తంగా 21 రోజుల పాటు లాక్‌డౌన్ విధిస్తున్నామని చెప్పారు. స్కూళ్ళు, కాలేజ్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు, కంపెనీలు, బస్‌లు, రైళ్ళు, దుకాణాలు, ఒక్కటేమిటి సమస్తం మూసేస్తారని ఉదయం నిద్రలేచాక అర్థమయ్యింది. పోలీస్‌ల పికెట్లు, మెడికల్ షాప్‌లు తప్ప ఏవి కనిపించడం లేదు. ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పెద్ద పెద్ద నగరాలలో వలస కూలీలు, కంపెనీలలో పని చేసుకోవడానికి వచ్చిన కార్మికులు బిక్కు బిక్కుమంటూ 21 రోజులు గడిపారు. జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. దీనికంతటికి కారణం 'కరోనా'!!

ప్రపంచం మొత్తం 'కరోనా' దెబ్బకు పూర్తిగా మారిపోయింది. భారతదేశమైతే ప్రతి విషయంలో సమూలంగా మారిపోయింది. విద్యార్థుల చదువులు, విద్యార్థుల పరిచర్యతో సహా అన్ని రంగాలలో పూర్తిగా మారిపోయింది. దీని పర్యవసానంగా గత మూడు సంవత్సరాలలో భారతదేశం అనేక సమస్యలతో ఉక్కిరిబిక్కిరవుతోంది.

సమకాలీన భారతదేశం ఎదుర్కొంటున్న కొన్ని ప్రధాన సమస్యల గురించి చర్చిందాం.

## 1. అస్తవ్యస్తమైన విద్యావ్యవస్థ

'కరోనా' మూలంగా విద్యా వ్యవస్థకు అపారనష్టం కలిగింది. విద్యార్థులకు చదువు మీద ఆసక్తి పూర్తిగా సన్నగిల్లిపోయింది. కరోనా సమయంలో కాలేజ్‌లకు రాకుండానే జూమ్, గూగూల్‌మీట్ వంటి మాధ్యమాలను ఉపయోగించి అధ్యాపకులు ఏంతో వ్యయప్రయాసలకోర్చి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కానీ విద్యార్థులు పరీక్షలు రాయకుండానే రెండు సంవత్సరాలపాటు ప్రభుత్వాలు వారిని పాస్ చేసేయడంతో వారు పుస్తకాలు ముట్టలేదు. ఈ చర్య వారిలో చదువు మీద ఆసక్తి తగ్గిపోయేలా చేసింది. ఇది అవిద్యకు దారితీసింది.

'విద్యలేని వాడు వింతపశువు' అని ఒక సామెత వుంది. అది ఒకప్పుడు! కానీ ఇప్పుడు విద్యలేని వారు దాదాపు ఎవరూ లేరు. ఎంత బీదలైనా తమ పిల్లలను చదివిస్తున్నారు. ఇప్పుడు సమస్యంతా అవిద్యతోనే! విద్యార్థులు జ్ఞానసముపార్జన పుస్తకాల ద్వారా కాకుండా వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా చేస్తున్నారు. కళాశాలలో విద్యార్థుల హాజరు 20% మించి ఉండడంలేదు. దీనివలన వారు సామాజిక మాధ్యమాలలో వచ్చే సమాచారాన్ని గుడ్డిగా నమ్మేస్తూ ఆధునిక అజ్ఞానులు గా తయారవుతున్నారు. మతం గురించి వచ్చే, రెచ్చగొట్టే పోస్టులను ఇట్టే నమ్మేస్తున్నారు. అంతేకాదు

చరిత్ర గూర్చి, ఆవిష్కరణల గూర్చి, నాయకుల గూర్చి వచ్చే సమాచారాన్ని ధృవీకరించుకోకుండా ఇతరులకు వాటిని ఫార్వాడ్ చేస్తూ వారిని కూడా తప్పుదోవపట్టిస్తున్నారు. దీన్ని సామాజిక మాధ్యమాలలో 'వాట్సాప్ యూనివర్సిటీ జ్ఞానం' అని సరదాగా అంటుంటారు.

కొంతమంది విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ సైతం 'వాట్సాప్ యూనివర్సిటీ' వలయంలో పడిపోవటం కాస్త బాధకలిగించే విషయం. యంపిసిలలో, బైబిల్ స్టడీస్‌లో మన విద్యార్థులను, గ్రాడ్యుయేట్స్‌ను ఈ విషయాలలో చైతన్యం చేయాలి. అంతే కాదు విద్యార్థులకు కనీసం 75% కళాశాలలకు హాజరవ్వడం నేర్పించాలి.

## 2. నిరుద్యోగం

ఇది చాలా పాత సమస్యనే గానీ ఎప్పటికీ అంతంకానిది. కరోనా మూలంగా ఈ సమస్య పతాక స్థాయికి చేరింది. ఈ ప్రభావం వలన నిత్యం వేల ఉద్యోగాలు పోతున్నాయి. 2022వ సంవత్సరం జూన్ నెలలో 1 కోటీ 30 లక్షల ఉద్యోగాలు పోయాయని ఒక అంచనా. ప్రతినెల నిరుద్యోగ శాతం పెరుగుతూనే ఉంది. గత నలభై దశాబ్దాల కంటే నిరుద్యోగ శాతం ఇప్పుడు అత్యధికంగా ఉందని విడుదల కాని యన్‌యస్‌యస్‌ఓ (నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్) నివేదిక చెబుతోంది. కరోనా కాలంలో మన యువ గ్రాడుయేట్స్ కూడా ఉద్యోగాలు కోల్పోయారు. బిజినెస్ టుడే పత్రిక ప్రకారం వైద్య రంగంలో 42.2%, విద్యారంగంలో 34.8%, ఏ రంగాలలోనైతే అధిక శాతం క్రైస్తవులు పనిచేస్తారో ఆ రంగాలలో 2019 నుండి 2021 మధ్యకాలంలో కరోనా మూలంగా ఎక్కువ ఉద్యోగాలు పోయాయి.

కరోనా కారణంగా లక్షలాది మంది ఆసుపత్రి పాలైయ్యారు కానీ విచిత్రంగా ఆ వైద్యరంగంలోనే అత్యధిక శాతం ఉద్యోగాలు పోయాయి. 2021 తరువాత ఆ రంగంలో 6.9% ఉద్యోగాలు పెరిగాయి. ఇది కేవలం చిన్న ఊరట మాత్రమే, ఎందుకంటే కోల్పోయిన ఉద్యోగాలతో పోలిస్తే వచ్చిన ఉద్యోగాల శాతం చాలా తక్కువ.

ఈ రెండు రంగాలలోనే మన గ్రాడ్యుయేట్స్ ఎక్కువమంది పనిచేస్తున్నారు. కొన్ని దశాబ్దాలు గా మన గ్రాడ్యుయేట్స్ విద్యారంగంపైనే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. 2004 నుండి మన కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్స్‌లో విద్యారంగం మీదనే కాకుండా మిగతా రంగాలపైన కూడా దృష్టిపెట్టాలని కోరుతూవచ్చారు. కనీసం ఇప్పుడైనా విభిన్నమైన రంగాలపైన దృష్టిపెడితే మంచిది.

ప్రస్తుతం మన దేశంలో ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్స్ నామమాత్రంగానే పడుతున్నాయి. అరకొరా నోటిఫికేషన్స్ పడినా విపరీతమైన పోటీ ఉంటుంది, ప్రైవేట్ రంగంలో ఉద్యోగాన్ని సంపాదించడం లేదా ఉన్న ఉద్యోగాన్ని కాపాడుకోవటం పెను సవాలుగా మారింది. పోటీని తట్టుకొని నిలబడడంకోసం అనేక నైపుణ్యాలు సంపాదించడంతో పాటు తక్కువ వేతనానికి ఒప్పుకుని, ఎక్కువ పని చేయడానికి, ఎక్కువ సమయం పని చేయడానికి సిద్ధపడాల్సివస్తుంది.

## 3. పెచ్చురిల్లిన అవినీతి

భారతదేశం ఎదుర్కొంటున్న, ఇంతవరకు పరిష్కారం దొరకని చాలా పెద్ద సమస్య అవినీతి. అవినీతికి చరిత్ర చాలా ఉంది. లంచం గురించి కీర్తనాకారుడు 15 వ కీర్తనలో ఇలా రాశాడు "తన ద్రవ్యము వడ్డీకియ్యడు; నిరపరాధిని చెరుపుటకై లంచము పుచ్చుకొనడు".

కరోనా అవినీతికి తలుపులు బార్లా తెరిచింది. డోలో 650 తయారుచేసే కంపెనీ వారి మందును ప్రిస్క్రిబ్షన్‌లలో రాయడానికి 1000 కోట్ల రూపాయల లంచాలను డాక్టర్లకు ఇచ్చారని ఒక విచారణ తరువాత సెంట్రల్ బ్యూరో ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ (సిబిడిటి) సంస్థ బయటపెట్టింది.

మన దేశంలో అవినీతిలేని వ్యవస్థ ఉందని చెప్పడం చాలా కష్టం. ప్రతిరంగంలో కిందిస్థాయి నుండి పైస్థాయి వరకు అవినీతి వైరస్ మాదిరి వ్యాపించింది. ప్రతి పనికి ఎంతోకొంత ముట్టచెబితే కానీ పని అస్సలు అవ్వడంలేదు. ఇది అందరికి తెలిసిన విషయమే కానీ ఎవ్వరూ దీనికి విరుద్ధంగా నిలబడరు. అవినీతికి వ్యతిరేకంగా నిలబడే క్రైస్తవుల కోసం దేవుడు చూస్తున్నాడు.

అవినీతి నిర్మూలన విద్యార్థులకే సాధ్యం. కానీ విద్యార్థులే అవినీతికి పాల్పడుతున్నారు.

కళాశాలకు హాజరవ్వకుండానే స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీఎంబర్స్‌మెంట్‌లు పొందుతున్నారు. పరీక్షలకు తగినవిధంగా సిద్ధపడకుండానే మార్కులు వేయమని, ఫెయిల్ అయినా పాస్ చేయమని పోరాటాలు, ధర్నాలు చేస్తున్నారు. విశ్వాస విద్యార్థులు సైతం ఇలాంటి వాటిలో పాల్గొనడం నాకు ఆవేదన కలిగి స్తున్నది.

యధార్థత అంటే సరైన పని చేయడం. అంటే, స్వచ్ఛమైన హృదయాన్ని కలిగివుండి ఆంతరంగిక సౌందర్యం బాహ్య చర్యలను నియంత్రించడానికి అనుమతించడం. ఇది జరగాలంటే మనం దేవుని మాట ప్రకారం నడుచుకోవాలి. సున్నం కొట్టిన సమాధులవలె ఉండొద్దని ప్రభువు మనలను హెచ్చరిస్తున్నాడు (మత్తయి 23:27). పరలోకంలో ఉన్న మన తండ్రివలె పరిపూర్ణులుగా మనలను ఉండమని మన ప్రభువైన యేసుక్రీస్తు పిలుస్తున్నాడు (మత్తయి 5:48). మరో మాటలో చెప్పాలంటే, మనం యధార్థముగా జీవించడానికి, ఉన్నతమైన నైతిక ప్రమాణాలను నిలబెట్టడానికి పిలువబడ్డాము (ఎఫెసీ 4:1). అవినీతిని అంతమొందించడం కేవలం నిబద్ధత కలిగిన క్రైస్తవులతోనే సాధ్యం. నేను నిబద్ధతగల క్రైస్తవుడినేనా అని మనం స్వపరీక్ష చేసుకోవాలి.

## 4. భ్రష్టుపట్టిన నాల్గవ ఎస్టేట్

భారతదేశం ఇప్పుడు ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్య భ్రష్టుపట్టిన నాల్గవ ఎస్టేట్. విస్తారంగా పెరిగిపోయిన వార్తా పత్రికలు, న్యూస్ ఛానల్స్ తమ ఉనికి కోసం ఎవరికో ఒకరికి కొమ్ము కాస్తూ నిజాయితీతో వార్తలను ప్రసారం చేయడం లేదు. ఒక పది సంవత్సరాల క్రితం ఏదైనా విషయం తెలిస్తే అది నిజమో కాదో పేపరు చదివి లేదా టీవీలో న్యూస్ చూసి నిర్ధారించుకొనేవాళ్ళం. గానీ ఇప్పుడు ఏ వార్త నమ్మాలో, ఏ వార్త నమ్మకూడదో తెలియడంలేదు ఎందుకంటే ప్రతీ రాజకీయ పార్టీకి స్వంతంగా ఒకటీ రెండు ఛానల్స్ ఉండటంతో పాటు ఆయా పార్టీలకు కొమ్ముకాసే ఛానల్స్ ఉండటం.

భారత మీడియా సంస్థలు “కంగారు కోర్టులను నడుపుతున్నాయని” ఇటీవల భారతదేశ సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యానం చాలు మీడియా ఎంతగా భ్రష్టుపట్టిందో చెప్పటానికి. చాలా మీడియా సంస్థలు లైంగిక వేధింపులు, అత్యాచారం, మోసం, ఆర్థిక అక్రమాలు, పెయిడ్ వార్తల ప్రసారం, చీకటి విదేశీ షెల్ కంపెనీలు నడపడం, మనీలాండరింగ్, బ్లాక్‌మెయిల్ వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్నాయి. వార్తలను నిజాయితీతో ఉన్నవి ఉన్నట్టుగా ప్రసారం చేసే జర్నలిస్టులు, పత్రికలు, న్యూస్ ఛానల్స్ రావాలని ప్రార్థన చేద్దాం.

## 5. నేరపూరిత రాజకీయ నాయకులు

భారతదేశం ఎదుర్కొంటున్న మరో ముఖ్యమైన సమస్య ఇది. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడిఆర్) సంస్థ 2,495 అభ్యర్థుల అఫిడవిట్‌లు విశ్లేషణ చేసి 296 మంది ఎమ్మెల్యేలు, 67 మంది ఎంపీలు, మొత్తం 363 మంది మీద చాలా స్పష్టమైన క్రిమినల్ కేసులు ఉన్నాయని నివేదిక ఇచ్చినట్లు ఫైనాన్సియల్ ఎక్స్‌ప్రెస్ పత్రిక ఆగస్ట్ 23, 2021న ప్రచురించింది. మనమీద చట్టాలను రూపొందించే వారే నేరపూరిత నేపథ్యం కలిగివుంటే దేశం ఎలా సరైన పంథాలో నడుస్తుంది? చట్టసభలలోకి మనం ఇంకా వెళ్ళకపోతే భవిష్యత్తులో క్రైస్తవులంగా భారీమూల్యం చెల్లించుకోవాల్సివస్తుందేమోనని నా భయం. ఎందుకంటే క్రైస్తవుల తరుపున చట్టసభలలో గళం వినిపించేవారు ప్రస్తుతం ఎవరూ లేరు. ఎలాంటి నేర చరిత్రలేని, విశ్వాసు లైన క్రైస్తవులు చట్టసభలలో ఉండటం ప్రస్తుతం అత్యవసరమైన విషయం. నిత్యం దేశంలో క్రైస్తవులపైన జరుగుతున్న దాడుల గురించి చట్టసభలలో మన గళం వినిపించి, ప్రభుత్వం నేరస్తులపైన చర్యలు తీసుకోవాలని పోరాటం చేసేవారు కావాలి.



ఎలెక్షన్స్ వచ్చిన ప్రతిసారి మనం ఫలానా పార్టీ కాకుండా మరో పార్టీ అధికారంలోకి రావాలని ప్రార్థన చేస్తున్నాం. (ఇది నేను 1989 నుండి గమనిస్తున్నాను) మనం ఏ పార్టీకి చెందిన వారం కాదు మన పార్టీ క్రీస్తు పార్టీ. కాబట్టి మనం పార్టీల గురించి కాకుండా యధార్థత కలిగిన విశ్వాసులు ఎలెక్షన్స్‌లో నిలబడాలని, వారు ఎన్నిక అవ్వాలని ప్రార్థన చేద్దాం. సాధారణ ఎన్నికలకు ఇంకా రెండు సంవత్సరాలుంది, కాబట్టి దేవుడు వారిని లేవనెత్తేలా ఇప్పటినుండే ప్రార్థన చేద్దాం.

## ముగింపు

భారతదేశం మతమౌఢ్యం, కులపిచ్చి, ఆర్థిక నేరాలు, మహిళలపై అఘాయిత్యాలు, రైతుల ఆత్మహత్యలు, విద్యార్థుల, యువకుల ఆత్మహత్యలు వంటి చాలా సమస్యలు ఎదుర్కొంటోంది. వీటన్నిటిని గురించి స్థలభావం చేత రాయడానికి వీలవ్వడం లేదు. అన్ని సమస్యలకూ మానవుని పాప స్వభావమే కారణమనీ మనకందరికీ చాలా బాగా తెలుసు. వాటికి సరైన పరిష్కారం కేవలం క్రీస్తు వద్ద మాత్రమే దొరుకుతుందని మన కళాశాలల్లో, కార్యాలయాలల్లో తేటతెల్లం చేయాలని యుఇయస్ఐ 3వ లక్ష్యమైన సాక్ష్యం కోరుతోంది.

పైన పేర్కొన్న సవాళ్లు నేటి దినాలలో క్రైస్తవ సంఘాల్లో కూడా చూస్తున్నాం. క్రైస్తవ సంఘం దేశంపట్ల యధార్థత కలిగిన మాదిరి నాయకత్వాన్ని చూపించాలి. కానీ అక్కడి నాయకులు దారుణ పరి స్థితుల్లో ఉన్నట్టు మనం చూస్తున్నాం. అక్కడక్కడా మన పరిచర్యలో కూడా ఇలాంటివి ఉన్నాయని వింటున్నాం. అదే నిజమైతే దేవుని ధవళ సిహాసనం ముందు తలదించుకొని నిలబడాల్సి వస్తుంది. పౌలు మనం సిగ్గుపడనక్కరలేని పనివారిగా ఉండాలని హెచ్చరిస్తున్నాడు. “దేవునియెదుట యోగ్యునిగాను, సిగ్గుపడ నక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్తపడుము” (2 తిమోతికి 2:15). అలా ఉండేటట్లు, మన దేశంలోని ఈ ప్రాముఖ్య సమస్యలకు దేవుడు తగిన విధంగా జవాబు ఇచ్చేటట్లు దేవుని సన్నిధిలో ప్రార్థిద్దాం, అవినీతికి వ్యతిరేకంగా పోరాడదాం.

**– డా. వైవీఆర్ ప్రసన్న కుమార్,** సూర్యాపేట

## ప్రభూ...నెహెమ్యా బుద్ధి నాకివ్వు



ప్రభూ...
ఎవరికోసం విచారిస్తున్నావు?
దేశం నాశనం కాకుండునట్లు
ప్రాకారం దిట్టపరిచే వారికోసమేనా?
ఆకారం లేకుండా పడగొట్టేవారేకానీ
దిట్టపరిచే వారే లేరా?
మట్టిగోడకు గచ్చుపూత పూసే
వట్టివారే కానీ...
గట్టిపరిచే వారే లేరా?
పట్టుదల కలవారే లేరా?

ప్రభూ...
ఎవరికోసం నిరీక్షిస్తున్నావు?
బద్ధలైన సందులలో
నిలిచే వారికోసమేనా?
వ్యర్థమైన విందులతో
పొద్దుపోక తిరిగేవారేకానీ
వ్యధతో పగిలిన గుండె సందుల్లో
నిలిచే వారే లేరా?
హృదయాలను బద్దలు చేసేవారే కానీ
హృదయ వేదనను తీర్చేవారే లేరా?

అందుకే ప్రభూ...
శుద్ధమైన మనస్సుతో
ప్రాకారాన్ని బాగుచేసిన
నెహెమ్యా బుద్ధి నాకిమ్ము
బద్దలైన సందుల్లో
నిలబడే శక్తి నాకిమ్ము
దేశ రక్షణకోసం
త్యాగంచేసే మనస్సు నాకిమ్ము

**– గొంగటి మేరీజాయ్,** ఆదోని



డివోషన్

# అన్ని విషయాల్లో స్వాతంత్ర్యం ఉంది కాని...

*అనవసరమైన పరిమితులు లేకపోవడాన్ని, ఒకని హక్కులను, అధికారాలను అనుభవించే అవకాశాన్ని "స్వేచ్ఛ" అని నిర్వచించవచ్చు. స్వేచ్ఛ పట్ల ఉన్న ఈ అవగాహనే నక్సలిజం, రాజకీయ స్వాతంత్ర్యం, ఆర్థిక స్వాతంత్ర్యం, దళిత ఉద్యమాలు, గే ఉద్యమాల వంటి వాటికి జన్మనిచ్చింది. ఒకని హక్కులను, అధికారాలను ఇష్టపూర్వకంగా క్రీస్తు ప్రభువు ఆధీనములోనికి తీసుకురావడాన్ని క్రైస్తవ స్వాతంత్ర్యంగా నిర్వచించవచ్చు. నిజమైన స్వేచ్ఛ అనేది ఈ ప్రపంచంలో ఎక్కడా లేదు. పరిపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కలిగిన ఏకైక వ్యక్తి దేవుడు మాత్రమే. పాపం, శరీరం, సాతాను బంధకాలలో మనం ఉన్నప్పుడు, దేవుడు తన మహా కృపచేత మనల్ని వాటినుండి విడిపించి మనకు స్వేచ్ఛనిచ్చాడు. క్రైస్తవులమైన మనం క్రీస్తు కాడిక్రింద మాత్రమే దేవుడిచ్చిన ఈ స్వేచ్ఛాఫలాలను అనుభవించగలం. "ఏలయనగా నా కాడి సుళువుగాను నా భారము తేలికగాను ఉన్నవి" అని ఆయన చెప్పాడు.*

దేవుని పిల్లలమైన మనం మన హక్కులు, అభిరుచులకు సంబంధించిన అనేక సవాళ్లను ప్రతిరోజూ ఎదుర్కొంటున్నాం. ఉదా: ఏమి తినాలి, ఏమి తినకూడదు, ఏమి చూడాలి, ఏమి చూడకూడదు, ఏమి మాట్లాడాలి, ఏమి మాట్లాడకూడదు, ఏమి ధరించాలి, ఏమి ధరించకూడదు వంటి వ్యక్తిగత అభిరుచులు, ఎవరికి లోబడాలి, ఎందుకు లోబడాలి వంటి ఉద్యోగపరమైన హక్కులు, నా ఇష్టపూర్వకంగా నేను పరిచర్యలో పాల్గొంటున్నాను కాబట్టి సంస్థలోని ఇతరులకు నేను ఎందుకు బాధ్యునిగా ఉండాలి, నాయకులకు ఎందుకు లోబడాలి, నేను దేవునికి లోబడతాను అనే పరిచర్యకు సంబంధించిన హక్కులు, అభిప్రాయాలు, సమాజంలోని అణగారిన ప్రజల కోసం ఎందుకు పోరాడాలి అనే సామాజిక హక్కులు, అభిప్రాయాలు, పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత నాకు ఎందుకు ఉన్నది, నా వాహనానికి కాలుష్య పరీక్ష ఎందుకు చేయించుకోవాలి, నా పరిసరాలను శుభ్రంగా ఎందుకు ఉంచుకోవాలి.. మొదలగునవి పరిసరాలకు సంబంధించిన హక్కులు, అభిప్రాయాలు.

మన జీవితంలో ప్రతి సందర్భంలో, ప్రతి కోణంలో క్రీస్తులో మనకు కలిగిన నిజస్వాతంత్ర్యాన్ని అనుభవించాలంటే మన హక్కులను, అభిప్రాయాలను, అభిరుచులను ఎలా సద్వినియోగం చేసుకోవాలో అపొస్తలుడైన పౌలు సవివరంగా రాశాడు. క్రీస్తులో మనకు కలిగిన స్వాతంత్ర్యం ఎలాంటిదో వివరిస్తూ దేవుని సంఘానికి పౌలుగారు ఐదు బంగారు సూత్రాలను తెలియజేస్తున్నాడు. 1 కొరింథీ 10:31-11:1లో మనం వాటిని చూడగలం. 10వ అధ్యాయంలోని ఈ చివరి వచనాలు 8,9,10 అధ్యాయాల్లో ఆయన చెప్పిన విషయాలకు ముగింపు మాటలు గా ఉన్నాయి.

**1. సమస్తాన్ని దేవుని మహిమకోసం చేయండి, మీ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేయవద్దు.**

"కాబట్టి మీరు భోజనము చేసినను పానము చేసినను మీరేమి చేసినను సమస్తమును దేవుని మహిమ కొరకు చేయుడి" (1 కొరింథీ 10:31)

'మీరేమి చేసినను' అనే మాటలో వ్యక్తిగతమైన, ఉద్యోగపరమైన, పరిచర్యకు, సామాజిక, ఆర్థిక విషయాలకు సంబంధించిన, చివరకు పరిసరాల సంరక్షణకు సంబంధించిన హక్కులు, అభిరుచులు మిళితమైయున్నాయి. వాటన్నిటినీ దేవుని మహిమకోసం చేయమని పౌలు మనకు వ్రాస్తున్నాడు. తన పనుల ద్వారా దేవునికి మహిమ కలుగుతుందా లేదా అని ప్రతి ఒక్క విశ్వాసి క్షుణ్ణంగా పరిశీలించుకోవాలి. ఉదాహరణకు, మనం ధరించే దుస్తుల విషయంలో, హెయిర్‌స్టయిల్ విషయంలో, ముఖానికి వేసుకొనే మేకప్ విషయంలో, మన ఖాళీ సమయాన్ని ఎలా గడుపుతున్నాము అనే విషయంలో, టి.విలో మనం చూసే కార్యక్రమాల విషయంలో, మనం వినే పాటల విషయంలో, ఇంకా మరెన్నో విషయాల్లో మనం అత్యంత అప్రమత్తంగా ఉండాలి. ఐగుప్తు నుండి కనానుకు బయలుదేరిన మన పితరులను పౌలు జ్ఞాపకం చేస్తున్నాడు. వారిలో చాలామంది తినుటకు, తాగుటకు, అన్యుల జీవన శైలిలో మునిగితేలడానికి ఇష్టపడ్డారు. వ్యభిచరించారు, ప్రభువును శోధించారు, ఆయనపై సణిగారు. దేవునికి అవమానాన్ని తీసుకువచ్చే అనేక చెడ్డ పనులు చేసినందున వారిలో అనేకమంది అరణ్యములోనే రాలిపోయారు. మనం చేస్తున్న పని దేవునికి మహిమ తెస్తుందా లేదా అన్నదే ఇక్కడ అత్యంత ప్రాముఖ్యమైన




విషయం. మన స్వంత అభిరుచులను, స్వాతంత్ర్యాలను దుర్వినియోగం చేసుకోవడానికి కాదు మనం ఈ పరిచర్యలో ఉన్నది. మనం చేసే ప్రతి పని ద్వారా దేవునికి మహిమ తీసుకురావడానికే మనం ఇక్కడ ఉన్నాం.

**2. "స్వప్రయోజనమును కోరక, అన్ని విషయములలో అందరిని సంతోషపరచాలి" వ 33:**

మన స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని స్థిరపరచుకొంటూ ఇతరులకు అడ్డుబండలా మారడం కాదు. అన్ని విషయాల్లో అందరినీ సంతోషపరచడం మన ప్రథమ లక్ష్యం. దానర్థం పరిశుద్ధతతో రాజీ పడమని కాదు. అందరినీ సంతోషపరచే విధంగా, వారిని క్రీస్తు కొరకు గెలిచేటట్లు తాను యూదులకు యూదునిగాను, బలహీనులకు బలహీనుడిగాను ఉన్నానని పౌలు రాస్తున్నాడు. మన విలువలకు, నమ్మకాలకు రాజీపడకుండానే మనుష్యులందరినీ అన్ని విషయాలలో సంతోషపరచడం అనేది అత్యంత సున్నితమైన విషయం.

**3. "స్వప్రయోజనం' గాక, అనేకుల ప్రయోజనం కోసం ప్రయాసపడాలి. "ఈలాగు నేను కూడా స్వప్రయోజనమును కోరక..." (వ.33):**

స్వాతంత్ర్యంలో చాలా ప్రయోజనాలు ఉన్నాయి. స్వాతంత్ర్యం అంటే ఏదైనా చేయడం అన్నది కొరింథీయుల భావం. పౌలు వారి భావనను అంగీకరిస్తూనే అన్నియు చేయదగినవి కావు,

క్షేమాభివృద్ధి కాదు అనే విషయాన్ని కూడా వారికి తెలియజేస్తున్నాడు. ఇతరుల క్షేమాభివృద్ధికోసం కొన్ని లాభాలను త్యజించడం చాలా అద్భుతమైన విషయం. బలహీనులు, బలవంతులు గురించి పౌలు మాట్లాడుతున్నాడు. బలహీనమైన మనస్సాక్షి కలిగిన ఒక వ్యక్తి పౌలు మాంసాన్ని తినడం చూసి అభ్యంతరపడితే, ఆ బలహీన మనస్సాక్షి కలిగిన వ్యక్తి నిమిత్తమై తాను ఇక ఎన్నడూ మాంసము తిననని పౌలు తెలియజేస్తున్నాడు. బలహీనమైన మనస్సాక్షి కలిగిన వ్యక్తుల కోసం ఇలాంటి లాభాలను త్యజించడానికి పౌలు ఇష్టపడ్డాడు.

**4. అనేకులు రక్షణపొందవలెనని వారి ప్రయోజనమును కోరుకోవాలి. నీ స్వంత రక్షణతోనే సంతృప్తి చెందకూడదు (వ.33):**

ఇతరులను సంతోషపరచడం, వారి ప్రయోజనాన్ని కోరడం వెనుక ఉన్న అంతిమ ఉద్దేశం వారిని క్రీస్తుకోసం గెలవడమే. ఇతరుల ప్రయోజనం కోసం పాటుపడడం అంటే బలహీన విశ్వాసులను విశ్వాసంలో బలపరచడమే. ఇతరులను రక్షించాలి అనే విశాల దృక్పథం మనల్ని త్యాగపూరిత క్రైస్తవులనుగా మారుస్తుంది. ఈ దృక్పథం లేకపోతే మనం స్వార్థపరులంగా మారిపోతాము. మన గురించి ఆలోచిస్తుంటాము. మన స్వంత రక్షణతోనే తృప్తి చెందుతాము.

**5. క్రీస్తును పోలి నడచుకోవాలి. గౌరవ మర్యాదల కోసం ప్రాకులాడకూడదు:**

ఈ జీవిత ప్రయాణంలో ఇప్పటి వరకు మనం సాధించిన విజయాలు మనల్ని గర్విష్టులనుగా మార్చే అవకాశం ఉన్నది. మనం క్రీస్తును మాదిరిగా తీసుకోవాలి. ఆయన మాదిరి పరిపూర్ణమైనది. దేవునితో సమానుడిగా ఉండడం అనే గొప్ప భాగ్యాన్ని ఆయన త్యజించి పాపులైన మానవులకోసం తననుతాను రిక్తునిగా చేసుకున్నాడు. తన వ్యక్తిగత అభిరుచులను, ఇష్టాలను తండ్రియైన దేవుని చిత్తం కోసం త్యజించాడు. పరిసయ్యులు ఆయనను “పాపుల స్నేహితుడు” అని పిలిచేంతగా ఆయన అందరితో కలిసిపోయాడు. అవసరతలో ఉన్న వారి అవసరాలు తీర్చాడు. నశించినదానిని వెదకి రక్షించడానికి ఆయన ప్రయాసపడ్డాడు. వారికోసం తన ప్రాణాన్నే సిలువలో అర్పించాడు.

క్రీస్తులో మనకున్న ఈ మహిమోన్నత స్వాతంత్ర్యాన్ని మనం అనుభవించేటట్లు, ఆనందించేటట్లు ఈ ఐదు బంగారు సూత్రాలను జ్ఞాపకం చేసుకుందాం. సమస్తాన్ని దేవుని మహిమకోసం చేద్దాం, అన్ని విషయాలలో అందరినీ సంతోషపరుద్దాం, అనేకుల మేలును కోరుకుందాం, అనేకుల రక్షణకోసం ప్రయాసపడదాం, క్రీస్తు మాదిరిని అనుసరిద్దాం. వీటిని గుర్తుచేసుకోవడమే కాదు, అనుదిన జీవితంలో వీటిని పాటించాలి. మన స్వాతంత్ర్యాన్ని దేవునికి అర్పించడం ద్వారా ఆయనలోని నిజ స్వాతంత్ర్యాన్ని అనుభవించునట్లుగా దేవుడు మనల్ని ఆశీర్వదించునుగాక!

– **గడ్డం సుధీర్ కుమార్,** నేషనల్ స్టాఫ్, నోయిడా

## ఇంకెవరు?



మారుచున్న మోడ్రన్ సమాజానికి
ఒక మోడల్‌గా ఉండాల్సింది ఎవరు?

మార్పుచెందాల్సిన విద్యార్థిలోకం కోసం
మరో మైలు నడవాల్సింది ఎవరు?

నశించిపోతున్న విద్యార్థుల కోసం
మోకాళ్ళు వంచి కన్నీళ్ళు కార్చే
నెహేమ్యా వంటి వారెవరు?

సణుగుల మధ్య సాత్వికంతో పనిచేసే
మోషేలాంటి నాయకులు ఎవరు?

యౌవ్వనేచ్ఛల నుండి పారిపోయి
ప్రత్యేకంగా జీవించిన యోసేపు వంటి
వారెవరు?

పనికంటే ప్రభువుకు ప్రాధాన్యతనిస్తూ
ప్రభువు పాదాల దగ్గర నేర్చుకొన్న
మరియవంటి వారెవరు?

యుఇయస్ఐ దర్శనాన్ని దగ్గరగా చూపించే
ప్రొ.ఇనాక్‌వంటి వారెవరు?

ఒక్కసారి ఆలోచించు మిత్రమా?
అది నీవు నేను కాదా?

– **కె. మధు,** ఒంగోలు ఇయు



# మేధోపరమైన పోరాటానికి సమయం ఆసన్నమైంది

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తన సందేశంలో "మన పాఠశాలలో దేశభక్తిని గూర్చి బోధించడం లేదు. పాఠశాలల్లో ప్రతిరోజూ ఒక గంటసేపు దేశభక్తి గూర్చి చర్చించాలని నిర్ణయం తీసుకొన్నాము, ఎందుకంటే విద్యార్థులు దేశాన్ని గౌరవించేవారిలా తయారు చేయడం కోసము" అని అంటాడు. అసెంబ్లీలో బడ్జెట్‌ని ప్రవేశపెట్టే సమయంలో ఢిల్లీ ఆర్థికశాఖా మంత్రి దానిని 'దేశభక్తి బడ్జెట్' అని పిలిచాడు.

భారత దేశంలో నాయకులు, సమూహాలు తమ ఆలోచనా విధానానికి సరితూగే విధానంలో దేశభక్తిని నిర్వచిస్తున్నారు. కొంతమందైతే దేశభక్తిని జాతీయవాదంతో సమానం చేశారు. ఆక్స్‌ఫర్డ్ లెర్నర్స్ డిక్షనరీ ప్రకారం దేశభక్తి అంటే 'దేశము పట్ల ప్రేమ, దానిని కాపాడడం' అని అర్థం. కోలిన్స్ ఇంగ్లీష్ డిక్షనరీ ప్రకారం దేశము పట్ల ప్రేమ, దానికి నమ్మకంగా ఉండడం. పై నిర్వచనాల ప్రకారం దేశభక్తి అంటే దేశాన్ని ప్రేమించడం, దానిని కాపాడడం, దానిపట్ల నమ్మకంగా ఉండడం అని మనం అర్థం చేసుకోవచ్చు.

మరోవైపు జాతీయవాదులు దేశము యొక్క బలాలను బట్టి డప్పు మోగిస్తూ, బలహీనతలను కప్పిపుచ్చేవారుగా ఉంటున్నారు. జాతీయవాదము అంటే 'దూకుడు/దౌర్జన్య దేశభక్తి'. దీనిని బోధించేవారు తమ సొంత దేశ ప్రయోజనాలను నొక్కి చెబుతూ, దేశము యొక్క బలహీనతలను గూర్చి మాట్లాడేవారిని జాతీయ వ్యతిరేకిగా లేదా దేశ ద్రోహిగా ముద్రవేస్తారు. నేడు దేశభక్తి పేరుతో విద్యార్థుల్లో జాతీయవాద బీజాలను నాటుతున్నారు. దీనివల్ల హేతుబద్ధంగా ఆలోచించడం మర్చిపోయి, భావోద్రేకాలవైపు, మూఢనమ్మకాలవైపు మళ్ళుతున్నారు.

ఈ క్రమంలో అసలు కాలేజ్, యూనివర్సిటీ విద్యార్థులు దేశభక్తిని గూర్చి ఏమనుకుంటున్నారో తెలుసుకొనే ప్రయత్నం చేశాను.

### దేశభక్తిని గూర్చి విద్యార్థుల అభిప్రాయాలు

"ప్రాణము లేని విగ్రహాలను, సమాధులను ప్రేమించడం నిజమైన దేశభక్తి కాదు, ప్రాణమున్న ప్రజలను ప్రేమించడం నిజమైన దేశభక్తి" అని ఒక విద్యార్థి అభిప్రాయపడ్డాడు ...

"అన్నీ రంగాలలో భిన్నత్వంతో సంబంధం లేకుండా దేశాన్ని కలిపివుంచే సెంటిమెంట్ ఇది. నేను ఇప్పటికీ జాతీయ గీతాన్ని విన్నప్పుడు లేదా

జాతీయ జెండా ఎగరవేయడం చూసినప్పుడు నాకు రోమాలు నిక్కబొడుచుకొంటాయి" అని ఒక పీజీ చదువుతున్న విద్యార్థి చెప్పాడు.

"దేశభక్తిని సరిహద్దులు, భౌగోళిక, మానవ నిర్మితాల ద్వారా నిర్వచించలేమని'' ఒక విద్యార్థి చెప్పాడు.

"మనము ఉక్రెయిన్, గాజాలోని బాధితుల గూర్చి, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో ఏమి జరుగుతుందో దాని వలన మనం బాధపడుతున్నాము. ప్రపంచమంతా ఒకే కుటుంబము అనే భావన ఉన్నతమైనది. నేను ఆ రకమైన దేశ భక్తిని సమర్థిస్తాను" అని బిఏ చదువుతున్న అమ్మాయి చెప్పింది.

"క్రికెట్ క్రీడా మైదానములో జరిగే ఆటను బట్టి దేశభక్తి ఉప్పొంగడంపై ఒక విద్యార్థి తన అసంతృప్తిని వ్యక్తపరచాడు.

నరేశ్ అనే విద్యార్థి "ఉన్నవారు, లేనివారి మధ్య అంతరాన్ని పూడ్చగలిగినప్పుడే నిజమైన స్వాతంత్ర్యాన్ని సాధించగలమని అభిప్రాయబడ్డాడు. అన్యాయానికి, అవినీతికి వ్యతిరేకంగా నా గళమెత్తడం కూడా ఒకరకమైన దేశభక్తి" అని అభిప్రాయపడ్డాడు.

## ప్రస్తుత కళాశాలల, విశ్వవిద్యాలయాల పరిస్థితి

కళాశాలల్లో ఉన్న విద్యార్థులు వాస్తవాలను హేతుబద్ధంగా ఆలోచించకుండా చేయడం కోసము దేశభక్తి పేరిట వారి భావోద్రేకాలను రెచ్చగొడుతూ, మత చాందస భావాలను నాటుతున్నారు. పాఠశాలల్లో, కళాశాలల్లో హాజరు చెప్పేటప్పుడు విద్యార్థులు 'జై హింద్' అనాలనే నిబంధనను మధ్యప్రదేశ్ ప్రభుత్వం అమలులోనికి తెచ్చింది. జాతీయ జెండాను ఎగరవేయడం, వందేమాతరం పాడడం అన్నీ పాఠశాలల్లో తప్పనిసరి చేశారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మదర్సాలలో జాతీయ గీతాన్ని ఆలపించడం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం మాత్రమే కాకుండా వాటిని చిత్రీకరించాలి అనే నిబంధనను తెచ్చారు. ముంబై మున్సిపాలిటీ పాఠశాలల్లో వందేమాతరం ఆలపించడాన్ని తప్పనిసరి చేసింది. జెయన్‌యులో విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడానికి 'ఆర్మీ నౌకను' ఉంచారు. విశ్వ విద్యాలయాల్లో ఒక పెద్ద గోడమీద పరమ వీర చక్ర అవార్డ్‌ని పొందిన సైనికుల చిత్ర పటాలు గీయాలని హెచ్‌ఆర్‌డి మంత్రిత్వ శాఖ ఆదేశించింది. కర్ణాటక ప్రభుత్వం, విద్యాశాఖ కూడా అశాస్త్రీయ, అహేతుకమైన పద్ధతిలో సిలబస్‌లో మార్పులను చేపట్టింది. ఆ మార్పులు జాతీయ విద్యా విధానము యొక్క ప్రాథమికమైన ఆత్మను చెరిపేవిగా ఉన్నాయి. నెమ్మదిగా చరిత్రను మార్చే పనిలో ప్రభుత్వాలు ఉన్నాయి. వీటిల్లో కొన్ని అభ్యంతరం కానప్పటికీ, వీటి వెనుక సదుద్దేశం లేదు. హిందూత్వ భావజాలాన్ని విద్యార్థుల మనస్సుల్లోకి చొప్పించడమే ప్రధాన లక్ష్యం.

హిందూత్వ భావజాలం నెమ్మదిగా చరిత్ర పుస్తకాలలోని అంశాలలోనికి చొచ్చుకు పోవడం ప్రారంభమైంది. హిందూ జాతీయవాద భావజాలాన్ని ప్రోత్సహించడానికి చరిత్రను తిరగరాయడానికి బలవంతం చేస్తున్నారు. దేశభక్తి పేరిట కళాశాలల్లో, యూనివర్శిటీల్లో హిందూత్వ భావజాలాన్ని చొప్పిస్తున్నారు. విశ్వవిద్యాలయాలలో జరిగే ఎన్నికలలో కూడా సాంస్కృతిక జాతీయవాదము కీలకపాత్ర పోషిస్తుంది. మతము పేరిట, కులం పేరిట విద్యార్థులను విభజిస్తూ .. అదే దేశభక్తి అనే భావనను కలిగిస్తున్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడే విద్యార్థులను దేశద్రోహులు అనే ముద్రవేసి, ప్రశ్నించాల్సిన విద్యార్థుల గొంతుకను నొక్కిపెడుతున్నారు. విజ్ఞాన కేంద్రాలుగా, విమర్శించే కేంద్రాలుగా ఉండవలసిన కళాశాలలను మత విద్వేషాలకు స్థావరంగా చేయడం, అచేతనపరచడం జరుగుతుంది.

## విశ్వాస విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ పాత్ర

విద్యావ్యవస్థను దేశభక్తి పేరిట హిందుత్వ భావజాలాన్ని వ్యాపింపజేయడానికి సాధనంగా వాడుకొంటున్నారు కాబట్టి మనము ఇప్పుడు చేయాల్సింది, భౌతికమైన పోరాటమో, మతపరమైన పోరాటమో కాదు, మేధో లేదా మానసికమైన పోరాటము. కలముతో, సాహిత్యంతో, సువార్తతో పోరాడాలి. దేవుడిచ్చిన బుద్ధి బలముతో పోరాటము చేయాల్సిన సమయం ఆసన్నమైంది. తరతరాల నుండి దేశము యొక్క ప్రధానమైన సమస్య 'ఆలోచనా విధానానికి' సంబంధించినది. ఎదుటివారి ఆలోచనల్లో మార్పు తీసుకురావాలంటే సత్యాన్ని

గూర్చిన అనుభవం జ్ఞానం మన జీవితాల్లో ఉండాలి. సత్యంతో మన జీవితాలు పెనవేసుకుపోవాలి. సత్యమంటే క్రీస్తు, దేవుని వాక్యమే. ఈ సత్యంతో కళాశాల విద్యార్థుల మనస్సులలో వక్రీకరింపబడుతున్న విషయాల్ని, క్రైస్తవ్యం, క్రీస్తు పట్ల ఉన్న తప్పుడు అవగాహనను మనము సరిచేయాలి. వక్రీకరింపబడుతున్న చరిత్రను వాస్తవ చరిత్ర ద్వారా వారి మనస్సులలోనికి మనము చొప్పించవలసిన అవసరత ఎంతైనా ఉంది.

సత్యము ద్వారా విద్యార్థులను స్వతంత్రులుగా చేయాలి. విద్యార్థుల యొక్క మనస్సు విముక్తి చెందాలి. పాపమునుండి విముక్తి చెందడమే అన్నిటి నుండి విముక్తి పొందడానికి మూలము లేదా ఆధారము. అప్పుడు మాత్రమే వారు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా నిజమైన స్వతంత్రులు కాగలరు. అలా స్వతంత్రులు అయినవారు నిజమైన పౌరులుగా జీవించడానికి కావలసిన బలాన్ని పొందుతారు.

"దేశభక్తి అంటే దేశాన్ని ప్రేమించడం, దానిని కాపాడడం, దానిపట్ల నమ్మకంగా ఉండడం" అనే అర్థాన్ని మనం చూశాం. ఈ లక్షణాలకు మూలం దేవుడే. ఆయనను తెలుసుకొని అంగీకరిస్తేనే ఈ లక్షణాలు కలిగి ఉండటానికి అవకాశం ఉంటుంది. దేవునిని ప్రేమించడం నేర్చుకొన్నవారు ఆయన పోలికలో సృష్టింపబడినవారిని కులమతాలకు, ప్రాంతాలకు, వర్గాలకు అతీతంగా ప్రేమిస్తారు. గనుక నిజమైన దేవునిని ప్రేమించడంతో నిజమైన, నిస్వార్థమైన దేశభక్తి ప్రారంభమవుతుందని విద్యార్థులకు తెలియజేయాలి.

తనకు శత్రువులు, అవిధేయులైన ప్రజల కోసము ప్రాణము పెట్టడానికి కూడా వెనుతీయక మరణించిన యేసును వ్యక్తిగతంగా తెలుసుకోవడంతో మనస్సు రూపాంతరం చెందడం ప్రారంభమై దేశ ప్రజల క్షేమం కోసం ప్రాణం పెట్టడానికి కూడా వెనుదీయనంత ప్రేమ, దేశభక్తి కలుగుతుంది. దేశభక్తి పేరిట స్వ దేశ సహోదరులను చంపడానికి వెనుకాడని వ్యక్తులకు, తన సహోదరుని కోసం ప్రాణము పెట్టాలని, నీ శత్రువును కూడా ప్రేమించాలని, క్షమించాలని బోధించిన క్రీస్తు బోధనలు మనకెంతో అవసరం. కులం, మతము, జాతి, ప్రాంతము పేరిట ప్రజలను విభజించి పాలిస్తున్నవారికి అన్యులను, యూదులను, దాసులను ఏక శరీరముగా ఒకే మానవాళిగా చేసిన క్రీస్తు చాలా అవసరం. నీ మతము వానిని ప్రేమించు పరాయి మతము వానిని ద్వేషించాలనే విషపు బీజాలు నాటుతున్న మన సమాజానికి నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించు అని ప్రభోదించిన క్రీస్తు తత్వము మనకున్న ఏకైక నిరీక్షణ కావాలి.



సువార్తే నిజమైన దేశభక్తిని, ప్రజల పట్ల ప్రేమను కలిగిస్తుంది అని మన చరిత్ర చెబుతుంది. ప్రస్తుతం, భవిష్యత్తులో కూడా నిజమైన దేశభక్తిని కలిగించేది సువార్త మాత్రమే. బాధాకరమైన విషయమేంటంటే అన్యాయం, అవినీతి జరుగుతున్నప్పుడు క్రైస్తవ విశ్వాసి యొక్క స్వరము వినబడడం లేదు. దేశములో ఉన్న పరిస్థితులకు ప్రతిస్పందనగా క్రైస్తవ సాహిత్యం రావడం లేదు. అసత్యంతో విద్యార్థుల మనస్సులను వారు నింపుతుంటే సత్యాన్ని, క్రీస్తును కలిగియున్న మనము మాత్రము మౌనవ్రతం దాల్చుతున్నాము. కేవలము ప్రార్థన ద్వారా మాత్రమే జయించే పోరాటం కాదు మాటల ద్వారా మనస్సును ఉపయోగించి పోరాడాల్సిన పోరాటమిది. మౌనాన్ని వీడి, మాట్లాడుదాం, చర్చిద్దాం, సత్యాన్ని, సువార్తను ప్రకటిద్దాం.

సామాజిక సమస్యల మీద, దేశ సమస్యల మీద, దేశ భక్తి మీద కళాశాలల్లో, యూనివర్సిటీల్లో జరిగే ఉపన్యాస పోటీల్లో, చర్చల్లో, వ్యాసరచన పోటీల్లో పాల్గొని మన క్రైస్తవ గళాన్ని వినిపిద్దాం. కాలేజ్ మ్యాగజైన్స్‌లో ఆర్టికల్స్ రాయడం ద్వారా కూడా మన యొక్క స్వరాన్ని, గళాన్ని వినిపించవచ్చు. గనుక మానసిక పోరాటానికి సిద్ధపడదాం. కళాశాలలను క్రీస్తు కోసము గెలుద్దాం.

**– డా. పి. నాసరయ్య,** వైజాగ్

కథానిక

# నువ్వు విడుదల పొందావా?



గది మధ్యలో ఉన్న ఫ్యాన్‌కు ఉరితాడు వేలాడుతోంది.

గదినిండా అలుముకున్న నిశ్శబ్దాన్ని గోడ గడియారం బద్దలు చేస్తోంది.

రెండు చేతులలోనూ తల దాచుకొని తనలో తనే రోదించసాగాడు రవి.

తనతో పాటు చదివిన స్నేహితులంతా అన్ని సబ్జెక్ట్‌లూ పాసై క్యాంపస్ సెలక్షన్స్‌లో మంచి ఉద్యోగాలు పొంది వెళ్లిపోయారు. తాను నిర్లక్ష్యం చేసిన పరీక్షలన్నీ ఇప్పుడు కళ్ళముందు కొండలా పేరుకుపోయాయి. ఎన్నిసార్లు రాసినా పదే పదే ఫెయిల్ అవడం, ఇంకా ఉద్యోగం ఎందుకు రాలేదని అడుగుతున్న తల్లిదండ్రులకు ఏమని చెప్పాలో తెలియక, ముఖం చూపించలేక జీవితాన్ని ముగించడమే మంచిదని ఈ దారిని ఎంచుకున్నాడు.

ఏదో సాధించాలని తపన పడిన జీవితం, ఎంతో ఎత్తుకు ఎదగాలని ఆరాటపడిన జీవితం, ఎవరినో తలదన్ని అందరికంటే ముందుకు కొనసాగాలని ఆశపడిన ప్రయాణం.. మరికొద్దిసేపట్లో ఉరితాడుకు మౌనంగా వేలాడుతుంది. అందని ఊపిరి కోసం కాసేపు తన్నుకులాడిన ప్రాణం నిర్జీవంగా మారి పోతుంది. ఎదిగిన కొడుకు ఉద్ధరిస్తాడని ఆశపడిన తల్లిదండ్రులు తమలో తామే కుమిలి కుమిలి ఏడుస్తారు. తోడబుట్టిన వాళ్ళు తల్లడిల్లుతారు. తెలిసిన వాళ్ళు 'అయ్యో' అనుకొంటారు. కలిసి తిరిగిన స్నేహితులు 'ఇలా ఎందుకు జరిగిందని' బాధపడతారు.

ఏమైతేనేమి.. ఆశతో ఎగసిపడిన కెరటం మరి కాసేపట్లో విరిగిపోతుంది. నిస్సహాయంగా నేలకు ఒరిగిపోతుంది. సాధించాలనే తపన కట్టెలా బిగుసుకుపోతుంది. ఎప్పటికీ తిరిగిరాని లోకాలకు తరలిపోతుంది.

కూలి పనులకు వెళ్ళి దాచిన డబ్బుల్ని తన చదువుకోసం పంపించిన తల్లిదండ్రులు గుర్తొచ్చారు. 'అటు వెళ్దాం, ఇటు వెళ్దాం, అది చూద్దాం ఇది చూద్దాం' అని వెంటపడి తిరిగిన స్నేహితులు గుర్తొచ్చారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించకుండా సరదాల పేరుతో స్నేహితులతో తిరిగినందుకు తనకు తగిన శాస్తి జరిగింది. ఇప్పుడేడ్చి లాభమేముంది?

***

మంచం మీదనుండి లేచి తాడు వైపు నడుస్తున్న రవి చెవికి దగ్గరగా నిలబడి ఎవరో "నువ్వు విడిపించబడ్డావా?" అని అడుగుతున్నట్లుగా

అనిపించి తుళ్ళిపడ్డాడు. దారిలో ఎక్కడ కనిపించినా "తమ్ముడూ.. నువ్వు విడిపించబడ్డావా?" అని పల కరించే జయన్న గుర్తొచ్చాడు.

కాలేజీ గ్రౌండ్‌లో ఎక్కడ కలిసినా బైబిల్ వాక్యాల్ని చెప్తూ, తన భవిష్యత్ గురించి అడుగుతూ, కుటుంబ పరిస్థితుల గురించి ఆరా తీసే జయన్నను పిచ్చివాడిలాగా భావించాడు. 'రెండు మూడుసార్లు నీ రూమ్‌కి వస్తే తాళం వేసి ఉంది తమ్ముడూ' అని చెప్తున్న జయన్న వంక చూస్తూ అతను రూమ్‌కు వచ్చే అవకాశం తప్పినందుకు ఊపిరి పీల్చుకున్నాడు. చెప్పేది తన మంచి గురించే అయినా తాను ఆ మాటల్ని పెడచెవిన పెట్టాడు. పైగా జయన్న మాటలు విన్నప్పుడల్లా 'అసలు విడిపించబడడమంటే ఏంటి?ఎవరి నుంచి విడిపించబడాలి? తననెవరూ కట్టివేయలేదు. తాను చాలా స్వేచ్ఛగా ఉన్నాడు, తన కాళ్ళకూ చేతులకూ ఏ విధమైన బంధకాలూ లేవు. అయినా అన్నెందుకు అలా అడుగుతున్నాడు' అని చాలాసార్లు అనిపించేది రవికి.

ఈ విషయాన్ని ఒకసారి జయన్నను అడిగితే "తమ్ముడూ.. స్వేచ్ఛంటే నగ్నంగా వీధుల్లో తిరగడం కాదు. దేశభక్తంటే.. దేశ సరిహద్దుల్ని పూజించి సాటి మనిషిని ద్వేషించడం కాదు. స్వాతంత్ర్యమంటే ఆగస్ట్ పదిహేనుకి జెండా ఎగరేసి మిఠాయిలు పంచుకోవడం కాదు.." అని చెప్తున్న అతని వంక ఆశ్చర్యంగా చూశాడు రవి. "తమ్ముడూ... ఇన్నేళ్ళుగా పరాయి పాలనలో ఎన్నో ఇబ్బందులు పడ్డాం కనుక పోరాడి స్వాతంత్ర్యం తెచ్చుకొని సంబరాలు జరుపుకొంటున్నాం. ఎంతోమంది దేశభక్తులు తమ ప్రాణాలను కూడా లెక్క చేయకుండా దేశానికి స్వాతంత్ర్యాన్ని ప్రసాదించారు. అది మంచిదే! మరి నిన్ను బంధించి ఉంచుతున్న పాపాల నుండి పాపపు అలవాట్ల నుంచి విడుదల పొందాలనే ఆశ నీకుందా? నీ అంతట నీవు వాటినుండి విడుదల పొందలేవు, నిన్ను విడిపించడానికి తన ప్రాణాన్ని బలియాగంగా అర్పించిన క్రీస్తును నువ్వు అంగీకరిస్తేనే తప్ప? అలా చేస్తేనే నీకు ఆత్మీయ స్వాతంత్ర్యం లభిస్తుంది. మంచికీ, చెడుకీ తేడా తెలుస్తుంది. పాపానికీ జీవానికీ మధ్య ఉన్న గీత విలువ అర్థమవుతుంది"

చెప్పుకుపోతున్న జయన్నకు అడ్డుపడుతూ "అన్నా.. మీరు చెప్పేవన్నీ బాగానే ఉన్నాయి. కానీ నేనేమీ బంధకాల్లో లేను. ఎక్కడికైనా వెళ్ళగలను, ఏ పనైనా చేయగలను, ఏదైనా మాట్లాడగలను. ఇందులో పాపమేముంది?" అని అడిగాడు. రవి వంక సాను భూతిగా చూసిన జయన్న కొనసాగిస్తూ "తమ్ముడూ.. నీ మాటల్లోనే నీ ప్రశ్నలన్నిటికీ సమాధానాలున్నాయి. నీవు చేయాల్సిన పనుల్ని చేయకుండా చేయకూడని పనుల్ని చేస్తూ, 'నేను ఏ బంధకాల్లో లేనని' భ్రమపడుతున్నావు. 'అన్ని పనులూ చేయడానికి నాకు స్వాతంత్ర్యం ఉంది గానీ, అన్ని పనులూ చేయదగినవి కావు' అని చెప్పిన వాక్యానికి విరుద్ధంగా మాట్లాడుతున్నావు. దేవుడు చెప్పిన ఆజ్ఞలకు వ్యతిరేకంగా ప్రవర్తించడం పాపం కదా!" అన్నాడు.

***

"ఫ్రెండ్స్‌తో తిరగడం, అప్పుడప్పుడూ సినిమాలకు వెళ్ళడం, కాలేజ్‌కి డుమ్మాకొట్టి పార్టీలకు వెళ్లడం, అలవాటుగా నాలుగు అబద్ధాలు.. ఇవన్నీ విద్యార్థి జీవితంలో సాధారణంగా అందరూ చేసేవే అన్నా. వాటిని కూడా పాపంగా భావిస్తే ఇక చేతులు కట్టేసుకొని ఇంట్లో కూర్చోవడమే బెటర్ కదా! ఇందులో పాపం, బానిసత్వం, విడిపించబడడం మొదలైన వాటిని గురించిన ఆలోచనే లేదు" అన్నాడు నిర్లక్ష్యంగా.

రవి వంక వాత్సల్యంతో చూశాడు జయన్న. కాసేపయ్యాక "తమ్ముడూ...నువ్వు కొన్ని అలవాట్లు, పనులు గురించి మాట్లాడుతున్నావు. నేను వీటికి మూలమైన పాపం గురించి మాట్లాడుతున్నాను. ఏ బేధము లేదు అందరూ పాపం చేశారని , దాని వలన వచ్చిన శిక్ష మరణమని బైబిల్ చెబుతుంది. నీవు దీని నుండి విడుదల పొందాలి. పాపపు శిక్ష నుండి తప్పించి, పాపపు అంధకారంలో ఉన్నవారిని విడిపించడానికే క్రీస్తు శరీరధారిగా ఈ లోకానికి వచ్చి మన కోసం సిలువలో మరణించాడు. నువ్వు సాతాను చెరనుండి విడిపించబడాలంటే యేసుక్రీస్తును నీ హృదయంలోకి ఆహ్వానించు. వాక్యానికి విధేయత చూపించు. అలా చేయకపోతే పైకి కనిపించని బలమైన సంకెళ్లలో పడి మన జీవితం నాశనమవుతుంది. అలవాట్లు ఆకర్షణీయంగా ఉంటాయి, అవి చేసేటప్పుడు ఆహ్లాదాన్ని ఇస్తాయి. కానీ వాటి ఫలితాలు ఘోరంగా ఉంటాయి. కాబట్టి, నా మాట విను పాపపు అలవాట్లనుండి తప్పించి, నీకు నూతన జీవితాన్ని ఇచ్చే యేసుక్రీస్తును దేవునిగా,

రక్షకునిగా, ప్రభువుగా అంగీకరించు” అని చెప్పి ముందుకు కదిలాడు జయన్న.

* * *

జయన్న గుర్తొస్తున్న కొద్దీ రవి మనసు మరింత దు:ఖసాగరంగా మారసాగింది. లోకంలోని ఆనందాల వెంటపడి విలువైన జీవితాన్ని అర్థాంతరంగా ముగించుకోవడానికి సిద్ధపడ్డాడు. స్వాతంత్ర్యమంటే జెండా పండుగ అనుకున్నాడు. కానీ తన ప్రాణాన్ని అర్పించి పాపపు బంధకాల నుండి, సాతాను దాస్యం నుంచి, మరణభయం నుండి విడిపించిన క్రీస్తును హృదయంలో కలిగి ఉండడమే నిజమైన స్వాత్ర్యంత్యం అని గుర్తించలేకపోయాడు.

తాడు మెడకు తగిలించుకొన్నాడు. కళ్లవెంట ధారాపాతంగా నీళ్ళు కారసాగాయి. కళ్ళు మూసుకుని తాడు బిగించుకొనే సమయంలో తలుపు గట్టిగా బాదుతున్నట్లు చప్పుడయ్యింది. ‘తీయాలా వద్దా’ అనే సందేహం చుట్టుముట్టింది. కిందకి దిగి తలుపు తీశాడు.

ఎదురుగా జయన్న కనిపించాడు. దిగాలుగా కనిపిస్తున్న రవి వంక, గదిలో వేలాడుతున్న తాడువంక చూసి పరిస్థితిని అర్థం చేసుకొన్నాడు. భుజం మీద చెయ్యేసి నడిపించుకొంటూ తీసుకెళ్ళి మంచం మీద కూర్చోబెట్టాడు.

“ఇప్పటికైనా నువ్వు నీ జీవితం విలువను గుర్తించావు తమ్ముడూ! నువ్వు చేసిన పనుల మీద నీకు విరక్తి కలిగింది. నీలో పరివర్తన మొదలయ్యింది. జీవితాన్ని ఒక్క క్షణంలో ముగించొచ్చు. అది పెద్ద విషయం కాదు. కానీ, తన ప్రాణాన్ని వెలగా చెల్లించి నిన్ను కొనుక్కున్న దేవుని ప్రణాళికను అర్థం చేసుకుని నీ జీవితాన్ని కొత్తగా మొదలుపెట్టు. ప్రార్థన చేసుకో. అన్ని బంధకాలను దూరం చేసుకొని దేవుని వాక్యానికి విధేయుడిగా ఉండు. ప్రభువు నీ చేయి విడిచిపెట్టడు. నీకు సహాయం చేస్తాడు” చెప్పడం ముగించి రవి కళ్లల్లోకి చూశాడు జయన్న.

అప్పటికే రవి కళ్లల్లో పశ్చాత్తాపపు నదులు ప్రవహించసాగాయి.

**– డా. జడా సుబ్బారావు,** నూజివీడు

# Crossword Puzzle

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 | | | 2 | 3 | 4 | 5 |
| 6 | 7 | | | | | |
| | | | | | | |
| | | 8 | | | | |
| | 9 | | | | | |
| 10 | | | | | | |

**Horizontal**

1. The man who died in his boots
7. The man who was good and right
8. The man whose birth caused a laugh
9. The man who sought after God
10. The Man who left all to follow Christ

**Vertical**

2. The man whose sin brought curse
3. The man who lacked parents’ authority
4. The man with a worldly mind
5. The man who was missed.
6. Grandson of Levi who died at 137 years




*Please find out the hidden words in the puzzle using the clues/hints and send to Nambur office within 15 days.*

**Last month key:**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| L | A | Z | A | R | U | S |
| | | S | | E | | O |
| C | H | A | L | C | O | L |
| J | U | D | A | H | N | O |
| | R | O | N | A | A | M |
| J | A | C | O | B | N | O |
| | | | | | | N |

1. *M. Ankarao, Guntur*
2. *R. Suma Srinivas, Guntur*

## కోశాధికారి లేఖ

# సంపూర్ణంగా దేవునిపై ఆధారపడదాం

క్రీస్తునందు ప్రియమైన యుఇయస్ఐ-ఏపి కుటుంబ సభ్యులకు, కోశాధికారులకు, ప్రార్థనా సహకారులకు మన ప్రభువైన యేసుక్రీస్తు నామంలో వందనాలు.

"మీరు చెడ్డవారై యుండియు మీ పిల్లలకు మంచి ఈవుల నియ్య నెరిగి యుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి అంతకంటే ఎంతో నిశ్చయముగా మంచి ఈవుల నిచ్చును" మత్తయి 7:10-11. ఈ లోకపు తండ్రులంగా మనం మన పిల్లలకు మంచి వాటిని ఇవ్వడానికి ఆలోచించి సిద్ధపరుస్తాం. మనమే ఇలా చేస్తే, మన మంచికాపరియైన పరలోకపు తండ్రి మనము అడిగిన వెంటనే నిశ్చయముగా మంచి ఈవులను ఇవ్వడా? ఖచ్చితంగా ఇస్తాడు. గనుక మన ప్రతి అవసరాన్ని ఆయన దగ్గరకు తీసుకెళదాం.

సంఘ చరిత్రలో అవసరాల గూర్చి ప్రార్థించడం, సమాచారం ఇవ్వడం, అడగడం గూర్చి భక్తులు ఇలా చెబుతారు. "ప్రభువు పరిచర్య కొరకు ఆర్థిక వనరులు సమకూర్చడం కేవలం ప్రార్థనతోనే" అని జార్జ్ ముల్లర్, "ప్రార్థించడం, సమాచారం ఇవ్వడం, సభ్యుల్ని అడగడం" అని చెప్పే డియల్ మూడీ, "ప్రార్థన, సమాచారం ఇవ్వడం తప్ప అడగకూడదని" హడ్సన్ టేలర్ చెబుతారు. యుఇయస్ఐ సభ్యులంగా మన ప్రతి అవసరం కోసం దేవునిమీదే ఆధారపడతాం. మన సభ్యులకు అవసరాల్ని తెలియజేస్తాము. ఇది ప్రారంభం నుంచి మన పితరులు మనకు నేర్పిన మాదిరి. అదే మాదిరిని ఇప్పుడూ కొనసాగిస్తున్నాం. దేవుడు మనందరి ప్రార్థనలు ఆలకించి అసాధ్యాలను సుసాధ్యాలుగా చేస్తున్నాడు. గనుక మన అవసరాల కోసం క్రమంగా ప్రార్థన చేద్దాం.

**స్తుతించండి**

1. మన స్టాఫ్‌కు 100% శాలరీ, అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభువు చూపిన కృపను బట్టి

**ప్రార్థించండి**

1. యుఇయస్ఐ-ఏపి ఏసియం-2022 తర్వాత పెరిగిన 16.53% బడ్జెట్‌కు అనుగుణంగా ఇజియఫ్‌లు కాంట్రిబ్యూషన్స్ పెంచి పంపేటట్లు
2. స్టైరెట్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కోసం 8 లక్షలు, చాందపిళ్ళ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కొరకు 5 లక్షలు అవసరం
3. యుఇయస్ఐ నేషనల్ వేతన సవరణలకు అనుగుణంగా మన స్టాఫ్‌కు కూడా వేతనాలు పెంచడానికి ఏసియం 2022 నిర్ణయించారు. దీని అవసరత ప్రతి నెల రూ. 70,000/- పెరుగుతుంది.
4. స్టాఫ్‌కు ఐదు ల్యాప్‌టాప్‌లు సబ్సిడీలో ఇవ్వడానికి అవసరమైన 1,20,000/- కొరకు

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు
యస్.ఆర్.డి. కిషోర్ కుమార్

**AP MONTHLY REQUIREMENT – Rs. 11,41,000/- (16.53% Hike W.R.T present income)**

**JUNE 2022**

| Receipts | | Payments | |
|---|---|---|---|
| Opening Balance | 3,909.00 | Field Staff Salaries | 4,84,735.00 |
| General Fund | 10,77,411.00 | Field Staff HRA, CA, MA & TA | 2,42,933.00 |
| Staff Support | 20,100.00 | Office Staff Salaries | 1,77,637.00 |
| | | UESI | 80,000.00 |
| | | Rajasthan | 30,000.00 |
| | | Jammu & Kashmir | 15,000.00 |
| | | APEGF | 3,000.00 |
| | | Girls Dept. | 3,500.00 |
| | | Office Expenditure | 27,579.00 |
| | | SWF | 35,000.00 |
| | | Closing Balance | 2,036.00 |
| **Total** | **11,01,420.00** | | **11,01,420.00** |

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-07-2022**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508



# దేశభక్తి

దేశం ఘోషిస్తోంది
దేశభక్తి పేరుతో జరిగే
అన్యాయాన్ని చూసి!

స్వేచ్ఛ సెగలు కక్కుతోంది
రెక్కలు కత్తిరిస్తూ బోధించే
స్వేచ్ఛా ప్రసంగాలను విని!

దేశమంటే మనుషులోయ్ అంటూ
గళమెత్తిన గురజాడకు
సలాం కొట్టిన దేశంలోనే
మనిషిని మట్టిలా భావిస్తుంటే
తట్టుకోలేకపోతోంది!

నా దేశాన్ని ప్రేమిస్తున్నానంటూ
ప్రతిజ్ఞ చేసినవారే
తోటి భారతీయులను ద్వేషిస్తుంటే
సహోదరత్వ హృదయం
తల్లడిల్లిపోతోంది!

కులాల మురికితనం
మతాల కరుకుతనం
దేశ గడ్డపై
రొమ్ము విరుస్తూ తిరుగుతుంటే
సామరస్య హృదయం
నెత్తురై ప్రవహిస్తోంది!

స్వార్థపు ధ్యేయాలే
అదృశ్య పంజరాలై
దేశాభ్యుదయ రెక్కల చుట్టూ
అల్లుకుపోతుంటే
మళ్ళీ స్వేచ్ఛ కావాలంటూ
ఆకలితో కేకలేస్తోంది!

దేవా...
నాడు నీ వాక్యమేగా
దేశానికి దీపమైంది!
నీ అహింసా మార్గమేగా
భారతానికి స్వేచ్ఛనిచ్చింది!

ప్రేమజాడలు లేని లోకంలో
నీవు బోధించిన ఆజ్ఞలే
మాకు అడుగుజాడలు!
దైవభక్తికీ, దేశభక్తికీ
అవి నిలువెత్తు నిర్వచనాలు!

నీ ఆజ్ఞల్ని
మనసులో ధ్యానించగానే
నా హృదయం ప్రశ్నించిందిలా!

సృష్టికర్తను ప్రేమించడం కంటే
దైవభక్తేముంది?
పొరుగువారిని ప్రేమించడం కంటే
దేశభక్తేముంది?

– ఎస్. ఈశ్వర్ (ఆర్కిటెక్ట్),
మెహదీపట్నం